V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం
14-10-2024

సంపుటి : 01 | సంచిక : 162 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

# చంద్రయాన్-4 ఉపగ్రహం తయారీకి శిక్షణ



108 దేశాలు.. 12 వేలమంది బాలికలకు అవకాశం


ఏరోస్పేస్ స్టార్టప్ 'స్పేస్ కిడ్జ్ ఇండియా' శ్రీకారం

శిక్షణ కోసం శక్తిశాట్ మిషన్ ప్రారంభం

ఈ మిషన్ దేశానికే కాదు.. ప్రపంచానికి ప్రయోజనం

మిషన్‌కు నేతృత్వం వహిస్తున్న కేసన్ ప్రకటన

**ఢిల్లీ:** అంతరిక్ష పరిశోధనల్లో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించే దిశగా ఏరోస్పేస్ అంకురసంస్థ (స్టార్టప్) 'స్పేస్ కిడ్జ్ ఇండియా' అనే సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇస్రో 'చంద్రయాన్-4' మిషన్‌లో ప్రయోగించేలా ఉపగ్రహాన్ని తయారుచేయడమే లక్ష్యంగా.. 108 దేశాలకు మిగతా2లో...



## హైదరాబాద్-విజయవాడ హైవేపై

# భారీగా ట్రాఫిక్ జామ్

## కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

- పండుగ ముగిసి సొంతూళ్ల నుంచి రాజధానికి ప్రయాణం
- నేటి నుంచి ప్రభుత్వ ఆఫీసులు, రేపటి నుంచి స్కూళ్లు ప్రారంభం
- పతంగి టోల్‌ప్లాజా వద్ద కిక్కిరిసిన వాహనాలు

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్‌లో భారీగా వా హనాల రద్దీ ఏర్పడింది. వందల సంఖ్యలో వాహనాలు హైదరాబాద్ వైపు వస్తుండటంతో రద్దీగా మారింది. దసరా పండుగను సొంతూర్లలో బంధు-మిత్రులతో కలిసి జరుపుకున్న పలువురు సంబురాలు ముగియడంతో తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం నుంచి మిగతా2లో...

## 'స్టార్‌షిప్' ప్రయోగం

# విజయవంతం

లాంచ్‌ప్యాడ్‌కే తిరిగొచ్చిన బూస్టర్

ప్రపంచంలోనే అతి పెద్ద రాకెట్

ఇదో ఇంజనీరింగ్ అద్భుతమన్న నిపుణులు



**టెక్సాస్:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్పేస్‌ఎక్స్' చేపట్టిన ప్రతిష్ఠాత్మక 'స్టార్‌షిప్' ఐదో ప్రయోగం విజయవంతమైంది. స్థానిక కాలమానం ప్రకారం.. ఆదివారం ఉదయం టెక్సాస్ దక్షిణ తీరం నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. రెండు దశల (బూస్టర్, స్పేస్‌క్రాఫ్ట్) ఈ భారీ రాకెట్‌లో తొలుత బూస్టర్ విజయవంతంగా భూమికి చేరుకుంది. లాంచ్‌ప్యాడ్ వద్దకే అది తిరిగి చేరుకోవడం విశేషం. మరోవైపు.. స్పేస్‌క్రాఫ్ట్ తన ప్రయాణాన్ని కొనసాగించి, మిగతా2లో...

## చీఫ్ విప్‌గా మహేందర్ రెడ్డి నియామకం..

# రాజ్యాంగ విరుద్ధం

- ఆయన బీఆర్ఎస్ నుంచి ఎన్నిక
- పెండింగ్‌లో అనర్హత పిటిషన్
- ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘాటు విమర్శలు



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారని, శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్‌గా పట్నం మహేందర్ రెడ్డి నియామకం ఇందుకు మరో ఉదాహరణ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ్యుడు హరీశ్‌రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన మహేందర్ రెడ్డిని ప్రభుత్వ చీఫ్ విప్‌గా మిగతా2లో...

ప్రతిసారి నిర్వహించినట్టుగానే.. ఈసారి కూడా దసరా తర్వాతి రోజున హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీల నేతలకు ఒకే వేదిక మీదికు తీసుకొచ్చే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని హర్యానా గవర్నర్ దత్తాత్రేయ.. 19 ఏళ్లుగా దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. అయితే.. గతంలో దత్తాత్రేయనే స్వయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. కొన్నేళ్లుగా ఆయన కుమార్తె విజయలక్ష్మి ఈ అలయ్ బలాయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈసారి నిర్వహించిన అలయ్ బలాయ్ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు హాజరవగా.. సీపీఐ నారాయణ బాయ్‌కాట్ చేశారు.



# అలయ్ బలయ్ అంటే గుర్తొచ్చేది దత్తాత్రేయే



## రాజకీయాలకతీతంగా నిర్వహించడం అభినందనీయం

ఉద్యమంలో కీలకమైన అలయ్ బలయ్: సీఎం రేవంత్ రెడ్డి

సమైక్యతా వారధుల నిర్మాణం సామాజిక బాధ్యత: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఘనంగా అలయ్ బలయ్

**విశ్వంభర, హైదరాబాద్:** అంతరించిపోతున్న సంస్కృతీ సంప్రదాయాలను అలయ్ బలయ్ ద్వారా దత్తాత్రేయ పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణ సంస్కృతి నలు దిశలా వ్యాపించడానికి, తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధన ఆలస్యం అయినప్పుడు పొలిటికల్ జేఏసీ ఏర్పాటుకు అలయ్, బలయ్ స్ఫూర్తిగా ఉపయోగపడిందని సీఎం గుర్తు చేశారు. ఆదివారం అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్.. గత 19 ఏళ్ల నుంచి దసరా సందర్భంగా మిగతా2లో...

## విప్లవాత్మక మార్పు తీసుకురావడమే

# గతిశక్తి లక్ష్యం

- గతిశక్తి మాస్టర్ ప్లాన్ తీసుకువచ్చాం
- ప్రధాని నరేంద్ర మోదీ



2

## పాలనలో ఇబ్బందులుంటే

# నన్ను సంప్రదించండి

పరిమిత అధికారాలతో పదేళ్లు ఢిల్లీని పాలించాను

జమ్మూ కశ్మీర్‌ను కూడా ఇలాగే మార్చారు

కొత్త సీఎం ఒమర్ అబ్దుల్లాకు కేజ్రీవాల్ సూచన



3

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఈడీ నుంచి

# ఎవరు రక్షిస్తున్నారు?

- ఓ మంత్రిపై దాడులు చేసినా బయటకు రాని సమాచారం
- మంత్రి ఇంట్లో రూ.100 కోట్లు పట్టుబడినట్లు వార్తలు
- 'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు

3



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 126 | రిటైల్ ₹ 148 |
| స్కిన్ ₹ 215 | స్కిన్ లెస్ ₹ 244 |

# ఎన్‌సీపీ నేత బాబా సిద్ధిఖీ దారుణ హత్య



- కుమారుడి ఆఫీసులో ఉండగా దారుణం
- కాల్పులు జరిపిన ముగ్గురు దుండగులు
- పోలీసులు అదుపులో ఇద్దరు... పరారీలో ఒకరు
- బాధ్యులను వదిలే ప్రసక్తే లేదు: సీఎం షిండే

2

# ఉల్లంఘనలు జరగలేదు

చీఫ్ విప్ సహా, ఇతర నియామకాలు రాజ్యాంగ బద్ధంగానే జరిగాయి

ఏం జరిగిందో అందరికీ తెలుసు..

హరీశ్.. ప్రతి విషయం రాజకీయం చేయడం తగదు..

శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ సహా, ఇతర నియామకాలు రాజ్యాంగ బద్ధంగానే జరిగాయని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎక్కడా ఉల్లంఘనలు జరగలేదన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. కేసీఆర్ హయాంలో హరీశ్‌రావు శాసనసభ వ్యవహారాల మంత్రిగా ఉన్న సమయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని, అప్పుడు రాజ్యాంగం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిగా బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని విమర్శించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మండలి ఛైర్మన్, సభాపతి నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. సంప్రదాయం ప్రకారమే ప్రతిపక్ష సభ్యుడికి పీఏసీ ఛైర్మన్ పదవి ఇచ్చినట్లు మిగతా2లో...

## పంచాంగం

**14-10-2024, సోమవారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం శుక్లపక్షం
**తిథి:** ఏకాదశి ఉ.06.41వరకు తర్వాత ద్వాదశి (పూర్తి)
**నక్షత్రం:** శతభిష రా.12.31వరకు
**సూర్యోదయం:** ఉ.6.12
**సూర్యాస్తమయం:** సా.5.51
**వర్జ్యం:** ఉ.06.25 నుంచి ఉ.07.51వరకు
**దుర్ముహూర్తం:** మ.12.25 నుంచి మ.01.11వరకు తిరిగి మ.02.45 నుంచి మ.03.31 వరకు
**రాహుకాలం:** ఉ.07.39 నుంచి ఉ.09.07వరకు
**అమృత ఘడియలు:** సా.06.09 నుంచి రా.07.36 వరకు

# అలయ్ బలయ్ అంటే గుర్తొచ్చేది దత్తాత్రేయే





నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కూతురు విజయలక్ష్మి నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఎండీ డా.కాచం సత్యనారాయణ..

(మొదటి పేజీ తరువాయి)
రాజకీయాలకు అతీతంగా గౌరవం అందుకునే బలయ్ బలయ్ ని బండారు దత్తాత్రేయ ఏర్పాటు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు.రాజకీయాలకతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ ఉద్యమంలో పొలిటికల్ జేఏసీ ఏర్పాటుకు అలయ్, బలయ్ స్ఫూర్తిగా ఉపయోగపడిందని సీఎం చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ పార్టీ ల వారీగా కార్యక్రమాలు జరిగేవి..తెలంగాణ సాధనలో అన్ని వర్గాలు కార్యోన్ముఖులై అడుగు ముందుకు వేయడానికి అలయ్ బలయ్ ఒక కారణమన్నారు. తెలంగాణ ప్రజలకు అతి పెద్ద పండుగ దసరా. దసరా అంటే పాలపిట్ట, జమ్మి చెట్టు గుర్తుకు వస్తాయి. అలానే అలయ్ బలయ్ అంటే గుర్తుకు వచ్చేది బండారు దత్తాత్రేయ అని సీఎం చెప్పారు. దత్తాత్రేయ వారసురాలిగా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న బండారు విజయలక్ష్మిని ఆయన అభినందించారు.తమ ప్రభుత్వం,పార్టీ పెద్దలంతా అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా తెలంగాణ సంప్రదాయాలు కాపాడుకోవడం మన బాధ్యత అని చెప్పామన్నారు.మేం అంతా ఒక్కటే అన్న సందేశాన్ని అలయ్ బలయ్ ద్వారా నాయకులు ఇచ్చారని రేవంత్ రెడ్డి అన్నారు.

**సమైక్యతా వారధుల నిర్మాణం సామాజిక బాధ్యత...**
మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. సమైక్యతా వారధుల నిర్మాణం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. పండుగలకు ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు సామాజిక ప్రాధాన్యత కూడా ఉందన్నారు. సమైక్యత అంటే అందరూ ఒకేమాట మీద నిలబడటమే కాదు.. ఇతరుల ఇష్టాలను సైతం గౌరవించటమని ఆయన పేర్కొన్నారు. సమాజంలో ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఏటా అలయ్ బలయ్ నిర్వహిస్తూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటం చాలా గొప్ప విషయమని వెంకయ్య నాయుడు అన్నారు. నేటి సమాజానికి సమైక్యత ఎంతో అవసరమని తెలిపిన ఆయన.. కుటుంబం, ప్రాంతం, దేశం, ప్రపంచం అనే సమైక్యత భావన పెరగాలని ఆకాంక్షించారు. పండగ అంటే పూజలు, ఆరాధనే కాదు.. పండగ అంటే అందరూ కలసి మెలసి కబుర్లు చెప్పుకోవడం కూడా అని వెంకయ్య చెప్పారు.

**కిషన్ రెడ్డి, పొన్నం పరస్పర కౌంటర్లు..**
అలయ్ బలయ్ కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విమర్శల విషయంలో ఒకరిపై ఒకరు.. స్టేజిపైనే కౌంటర్లు వేసుకున్నారు. ముఖ్యంగా.. ఈ అలయ్ బలయ్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రాజకీయ నాయకులు చేస్తున్న విమర్శలు హద్దుమీరుతున్నాయని గుర్తు చేసిన కిషన్ రెడ్డి.. నాయకుల ప్రసంగాల్లో, భాషలో మార్పు రావాలని ఆకాంక్షించారు. విమర్శించుకుందాం కానీ.. ప్రజలు అసహ్యంచుకునేలా మాట్లాడకండి అంటూ కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికలప్పుడు ఘర్షణ పడొచ్చు కానీ.. ఎన్నికలయ్యాక ప్రజల శ్రేయస్సే ముఖ్యమని హితవు పలికారు. పార్టీలు విమర్శించుకుంటున్న విధానాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. పరోక్షంగా కాంగ్రెస్ నాయకులపై కౌంటర్లు వేశారు. అయితే.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఇన్ డైరెక్టుగా కౌంటర్ వేశాడు. రాజకీయాల్లో భాష ముఖ్యమని.. వేరేవాళ్లకు ఇబ్బంది కలగకుండా ఉండాలన్నది నిజనేనని పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. అయితే.. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడకుండా స్వీయ నియంత్రణ అవసరమంటూ కౌంటర్ వేశారు. తెలంగాణలో మత విద్వేషాలు రెచ్చగొట్టకుండా మాట్లాడేలా దత్తాత్రేయ చొరవ చూపాలని కోరారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డిని దత్తాత్రేయ సన్మానించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, బీజేపీ నేత లక్ష్మణ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మేఘాలయ గవర్నర్లు, వివిధ పార్టీలకు చెందిన నేతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

## చంద్రయాన్-4 ఉపగ్రహం తయారీకి శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)
చెందిన 12 వేలమంది బాలికలకు అంతరిక్ష సాంకేతికతపై శిక్షణ ఇచ్చేందుకు 'శక్తిశాట్' అనే మిషన్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికార పోస్టర్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము త్వరలో ఆవిష్కరించనున్నట్లు తెలిపింది. ''శక్తిశాట్ మిషన్ కింద 108 దేశాలకు చెందిన 12 వేల మంది హైస్కూల్ విద్యార్థినులకు (14-18 ఏళ్లు) అంతరిక్ష సాంకేతికత, పేలోడ్ అభివృద్ధి, వ్యోమనౌక వ్యవస్థల గురించి ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నాం. బ్రిటన్, యూఏఈ, బ్రెజిల్, కెన్యా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, గ్రీస్, శ్రీలంక తదితర దేశాలు ఇందులో భాగమవుతాయి. శిక్షణ అనంతరం ప్రతి దేశం నుంచి ఒకర్ని చొప్పున 108 మందిని ఎంపిక చేస్తాం. పేలోడ్‌లు, స్పేస్‌క్రాఫ్ట్ ప్రోటోటైప్‌లను రూపొందించడంలో శిక్షణ ఇస్తాం. ఇస్రో 'చంద్రయాన్-4' మిషన్‌లో ఉపగ్రహాన్ని ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ ముందు నమూనా ప్రజెంటేషన్ ఇవ్వనున్నాం'' అని మిషన్‌కు నేతృత్వం వహిస్తున్న శ్రీమతి కేసన్ 'పీటీఐ' వార్తాసంస్థకు తెలిపారు. 'శక్తిశాట్' మిషన్ కేవలం మన దేశానికే కాకుండా మొత్తం ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చే సామర్థ్యం కలిగి ఉందని శ్రీమతి కేసన్ తెలిపారు. బాలికలను ప్రోత్సహించడం ద్వారా సాధికారతను కల్పించడం, జీవితాలను మార్చేసే అవకాశాలను అందించడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. స్పేస్ కిడ్జ్ ఇండియా ఇప్పటివరకు 18కిపైగా బెలూన్ శాటిలైట్లు, మూడు సబ్ఆర్బిటల్ పేలోడ్‌లు, నాలుగు ఆర్బిటల్ ఉపగ్రహాలను ప్రయోగించింది. హైస్కూల్, కళాశాల విద్యార్థుల సాయంతో ఉపగ్రహాలను ప్రయోగించిన మొట్టమొదటి సంస్థగా పేరుంది.

## 'స్టార్‌షిప్' ప్రయోగం విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)
హిందూ మహాసముద్రంలో విజయవంతంగా దిగింది. 71 మీటర్ల పొడవైన భారీ బూస్టర్.. నింగికెగిసిన కొద్దిసేపటికి తిరిగి లాంచ్‌ప్యాడ్ వద్దకు చేరుకోగా, అక్కడున్న చాప్‌స్టిక్‌లు దాన్ని ఒడిసిపట్టాయి. ఇదో ఇంజినీరింగ్ అద్భుతమని నిపుణులు కొనియాడారు. దీనికి సంబంధించిన వీడియోను ఎలాన్ మస్క్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మరోవైపు.. స్పేస్‌క్రాఫ్ట్ నిర్దేశిత ప్రదేశంలో కచ్చితత్వంతో ల్యాండ్ అయినట్లు మస్క్ తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా తమ రెండు లక్ష్యాలూ నెరవేరినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో స్పేస్‌ఎక్స్ కంట్రోల్ రూంలో సందడి వాతావరణం నెలకొంది. స్టార్‌షిప్ రాకెట్ పొడవు ఏకంగా 121 మీటర్లు (400 అడుగులు). రెండు దశల (బూస్టర్, స్పేస్‌క్రాఫ్ట్)తో ప్రపంచంలోనే అతిపెద్ద రాకెట్‌గా పేరుపొందిన దీన్ని.. చందమామ, అంగారకుడిపై యాత్రలకు వీలుగా 'స్పేస్‌ఎక్స్' రూపొందించింది. ఫ్లోరిడా లేదా కాలిఫోర్నియా నుంచి భూకక్ష్యలోకి ఉపగ్రహాలను చేరవేసే, ఐఎస్ఎస్‌కు సిబ్బందిని తరలించే 'ఫాల్కన్-9' రాకెట్ల మొదటి దశ బూస్టర్‌లు కూడా భూమిపైకి చేరుకుంటాయి. కానీ, అవి సముద్రంలో తేలియాడే ప్లాట్‌ఫాంలపై, లాంచ్ ప్యాడ్‌లకు దూరంగా ఉన్న కాంక్రీట్ స్లాబ్‌లపై దిగుతాయి. లాంచ్‌ప్యాడ్‌కే చేరుకోవడం ఇదే మొదటిసారి.

## విప్లవాత్మక మార్పు తీసుకురావడమే గతిశక్తి లక్ష్యం

**దిల్లీ:** ప్రధానమంత్రి గతిశక్తి ప్రాజెక్టు గురించి ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. మౌలిక సదుపాయాలలో విప్లవాత్మక మార్పు తీసుకు రావడమే లక్ష్యంగా గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌ను తీసుకువచ్చామని పేర్కొన్నారు. దీని ద్వారా దేశం అన్ని మౌలిక రంగాల్లో మరింత వేగంగా, సమర్థవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. వివిధ ఆర్థిక ప్రణాళికలకు బహుళ-మోడల్ కనెక్టివిటీ మౌలిక సదుపాయాలను అందించడం కోసం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ను 2021, అక్టోబర్ 13న అమల్లోకి తీసుకువచ్చారు. దీనిని ప్రారంభించి మూడేళ్లు అయిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ గతిశక్తి దేశంలోని రైల్వే, రోడ్లు, ఓడరేవులు, జలమార్గాలు, విమానాశ్రయాలు, లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి వాటి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని మరింత వేగంగా చేరుకునేందుకు గతిశక్తి ఉపయోగపడుతుందన్నారు. మరిన్ని నూతన ఆవిష్కరణలను సైతం ప్రోత్సహిస్తోందని తెలిపారు.

## మేయర్ విజయలక్ష్మిపై కేసు నమోదు

### బతుకమ్మ సంబురాల్లో నిబంధనల ఉల్లంఘన

**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బతుకమ్మ సంబరాల్లో భాగంగా శబ్ద కాలుష్య నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను ఆమెపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనుమతించిన సమయానికి మించి, ఎక్కువ శబ్ద తీవ్రతతో పాటలు పెట్టారని, దీనిని సుమోటోగా స్వీకరించి ఆమెపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## ఉల్లంఘనలు జరగలేదు



(మొదటి పేజీ తరువాయి)
మంత్రి తెలిపారు. అనర్హత పిటిషన్ల అంశం న్యాయస్థానం పరిధిలో ఉందన్నారు.మండలి చీఫ్ విప్‌గా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని ఎలా నియమించారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించిన సంగతి తెలిసిందే. రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ అని ఆయన అన్నారు. పీఏసీ ఛైర్మన్ విషయంలో కూడా ఇలాగే వ్యవహరించారని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు.

# ఎన్‌సీపీ నేత బాబా సిద్ధిఖీ దారుణ హత్య

**ముంబయి:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్ పక్షం) సీనియర్ నేత, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ దారుణ హత్యకు గురయ్యారు. ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా, ముగ్గురు దుండగులు వచ్చి సిద్ధిఖీపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. వెంటనే అతనిని లీలావతి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనితో ఆదివారం ఉదయం ఆయన మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కూపర్ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు సిద్ధిఖీపై కాల్పులకు పాల్పడ్డ వారిలో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు 5 దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న సిద్ధిఖీ కొన్ని నెలల కిందటే ఎన్సీపీలో చేరడం గమనార్హం.

**రాష్ట్రంలో శాంతి, భద్రతలు క్షీణించాయి!**
ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తీవ్రంగా ఖండించారు. లీలావతి ఆసుపత్రికి వెళ్లిన సీఎం ఏక్‌నాథ్ షిండే సిద్ధిఖీ కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులైనవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. మరోవైపు ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్యను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ఖండించారు. ఈ దారుణానికి పాల్పినవారిని పట్టుకుని, కఠినంగా శిక్షించాలని కోరారు. మహారాష్ట్రలో శాంతిభద్రతలు క్షీణించాయని, ఈ ఘటనపై పారదర్శకంగా సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. శివసేన (యుబీటీ) నేతలు కూడా బాబా సిద్ధిక్ హత్యను ఖండించారు. మహారాష్ట్రలో శాంతి, భద్రతలు పూర్తిగా క్షీణించాయని విమర్శించారు. సిద్ధిఖీ మరణించిన నేపథ్యంలో సల్మాన్‌ఖాన్, షిల్పా శెట్టి సహా పలువురు బాలీవుడ్ తారలు లీలావతి ఆసుపత్రికి వచ్చారు. సిద్ధిఖీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**ఎన్నికలకు ముందు దారుణం**
మరో నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ కాల్పులు జరగడం గమనార్హం. సిద్ధిఖీ 1999, 2004, 2009లో బాంద్రా వెస్ట్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004, 2009లో రాష్ట్ర మంత్రిగా కూడా పనిచేశారు. ప్రజా సేవ చేయడంతోపాటు, ఆయన చాలా గ్రాండ్‌గా పార్టీలు నిర్వహిస్తుంటారని చెబుతుంటారు. 2013లో సిద్ధిఖీ నిర్వహించిన ఇఫ్తార్ విందులో బాలీవుడ్ స్టార్స్ షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ హాజరయ్యారు. అప్పట్లో వారిద్దరి మధ్య విభేదాలుండేవి. కానీ సిద్ధిఖీ పెద్ద పార్టీ ఏర్పాటు చేసి, ఆ ఇద్దరు స్టార్స్‌ను దగ్గరకు చేర్చి గొడవలకు ఫుల్‌స్టాప్ పెట్టించారు.

**పక్కా ప్రణాళికతో బాబా సిద్ధిఖీ హత్య**
బాబా సిద్ధిఖీని దుండగులు పక్కా ప్రణాళికతోనే హత్య చేశారని ముంబయి పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు కొన్ని నెలల ముందు నుంచే సిద్ధిఖీ నివాసం, కార్యాలయాల వద్ద నిందితులు రెక్కీ నిర్వహించినట్లు వెల్లడించారు. మరోవైపు బాబా సిద్ధిఖీకి, ఓ మురికివాడ పునరావాస ప్రాజెక్టు విషయంలో వ్యాపార వివాదాలే ఈ సుపారీ హత్యకు కారణమై ఉండొచ్చన్న కోణంలోనూ ముంబయి క్రైమ్ బ్రాంచ్ విచారణ జరుపుతోంది. ఈ కేసును దర్యాప్తు చేసేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని పంపినట్లు దిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ తెలిపింది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో శాంతి భద్రతలు పతనమయ్యాయంటూ ప్రతి పక్షాలు విమర్శిస్తున్నాయి. ఇక ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, మరొకరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పోలీసులు పేర్కొన్నారు. ముగ్గురు నిందితులపై ఆయుధాల చట్టం, భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్స్ కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అరెస్టైన నిందితుల్లో ఒకరు హరియాణాకు చెందిన గుర్మైయిల్ బల్జీత్ సింగ్ (23) కాగా, మరొకరు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ధర్మ రాజ్ రాజేశ్ కష్యప్ (19)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు గత రెండు నెలల నుంచే సిద్ధిఖీ నివాసం వద్ద రెక్కీ నిర్వహించినట్లు విచారణలో తేలిందని చెప్పారు. కొన్ని రోజుల ముందే నిందితులకు ఆయుధాలు అందాయని, కాల్పులు జరిపిన తర్వాత తప్పించుకునేందుకు ఘటనా సమయంలో బాణాసంచా పేల్చినట్లు పేర్కొన్నారు. ఫోరెన్సిక్ బృందం క్రైమ్ స్పాట్‌ను సందర్శించి నమూనాలను సేకరించిందని, సమీప ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీని తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు సిద్ధిఖీ హత్యకు నిరసనగా ఆదివారం పార్టీ కార్యకాలపాలన్నింటినీ రద్దు చేశామని ఎన్‌సీపీ ప్రకటించింది.

**'2-3 రోజుల్లో నిజం తెలుస్తుంది'**
ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందించారు. 'ముంబయిలో జరిగిన ఘటనను నేను నమ్మలేకపోతున్నా. ఆయన ఏళ్ల తరబడి పని చేశారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు మూడుసార్లు ఎమ్మెల్యే గా పని చేశారు. మేము పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. దీని వెనుక ఎవరున్నారో రెండు, మూడు రోజుల్లో తెలుస్తుందని నేను నమ్ముతున్నా. ప్రతిపక్షాలు ప్రభుత్వాని నిందిస్తున్నాయి. కానీ మా పని లా అండ్ ఆర్డర్‌ను చూసుకోవడం ' అని అజిత్ పవార్ తెలిపారు.

**బాబా సిద్ధిఖీని చంపింది మేమే..లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటన**
బాబా సిద్ధిఖీని హత్య చేసింది తామేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. ఈ కేసులో అరెస్టయిన హరియాణాకు చెందిన కర్నైల్ సింగ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మరాజ్ కశ్యప్ అనే ఇద్దరు నిందితులు తాము లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందినవారమని పేర్కొన్నట్లు ఇప్పటికే పోలీసు వర్గాలు వెల్లడించాయి. మూడో నిందితుడైన యూపీకి చెందిన శివకుమార్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. సిద్ధిఖీని హత్య చేయడానికి నిందితులు కొన్ని నెలలుగా ప్రణాళికలు రచించారని.. ఆయనకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ..సిద్ధిఖీ నివాసం, కార్యాలయంపై నిఘా పెట్టారని తెలిపారు. ఈ హత్య చేసినందుకు గాను నిందితులకు ఒక్కొక్కరికి బిష్ణోయ్ గ్యాంగ్ రూ.50,000 అడ్వాన్స్, మారణాయుధాలు ఇచ్చినట్లుగా తమ విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు.ఈ ఏడాది ఏప్రిల్‌లో బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. 'ఇది ట్రైలర్ మాత్రమే.. ముందుంది అసలు సినిమా' అంటూ నాడు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ పోస్ట్ పెట్టారు. తాజా ఘటన నేపథ్యంలో సల్మాన్ ఇంటి వద్ద భద్రతను పెంచారు.

**'బాబా సిద్ధిఖీ హత్యతో.. దేశం మొత్తం భయపడుతోంది'**
**దిల్లీ:** బాబా సిద్ధిఖీ హత్య మహారాష్ట్ర, బాలీవుడ్‌లో సంచలనం రేపుతోంది. ఈ ఘటనపై ఎక్స్ వేదికగా దిల్లీ మాజీ ముఖ్యమంత్రి , ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఈ హత్యతో మహారాష్ట్ర మాత్రమే కాదు దేశం మొత్తం భయపడుతోందన్నారు. దిల్లీలో కూడా ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని.. గ్యాంగ్‌స్టర్ పాలన తీసుకురావాలనుకునేవారికి వ్యతిరేకంగా ప్రజలు నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## చీఫ్ విప్‌గా మహేందర్ రెడ్డి నియామకం రాజ్యాంగ విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)
నియమించడం రాజ్యాంగ విరుద్ధమని, కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందని ఆక్షేపించారు. మండలిలో బిల్ పాస్ చేయించడం, ప్రభుత్వ బిజినెస్ జరిగేలా చూడడం చీఫ్ విప్ బాధ్యత అని, మహేందర్ రెడ్డి ఇప్పుడు ఎవరికి విప్ ఇస్తారని ప్రశ్నించారు. ఆయన అధికార పార్టీ సభ్యులకు విప్ ఇస్తారా? లేక ప్రతిపక్ష పార్టీ సభ్యులకు విప్ ఇస్తారా? అని అడిగారు. బీఆర్ఎస్‌కు కూడా మండలిలో విప్ ఉంటారని, సభకు హాజరు, బిల్లుపై ఓటింగ్ సమయంలో బీఆర్ఎస్ విప్ కూడా పార్టీ సభ్యులకు విప్ ఇస్తారని హరీశ్‌రావు వివరించారు. ఇప్పుడు బీఆర్ఎస్ విప్ ప్రభుత్వ చీఫ్ విప్‌కు కూడా విప్ ఇస్తారని పేర్కొన్నారు. చీఫ్ విప్ ఇప్పుడు బీఆర్ఎస్ విప్ ప్రకారం నడుచుకుంటారా? అని ఆయన ప్రశ్నించారు. పీఏసీ ఛైర్మన్ విషయంలో కూడా ఇలాగే వ్యవహరించారని గుర్తు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు సంబంధం లేదు అన్నారని, ఇప్పుడు బీఆర్ఎస్‌కు చెందిన మహేందర్ రెడ్డికి ప్రభుత్వ చీఫ్ విప్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మహేందర్ రెడ్డిపై ఛైర్మన్ వద్ద ఇప్పటికే అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉందన్న హరీశ్‌రావు, పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఛైర్మన్ బులెటిన్ ఇచ్చారని తెలిపారు. మహేందర్ రెడ్డిపై అనర్హత పిటిషన్‌కు ఇంతకు మించిన ఆధారం ఇంకా ఏం ఉంటుందని ప్రశ్నించారు. ఛైర్మన్ ఇచ్చిన బులెటిన్ అనర్హత పిటిషన్‌కు మరింత బలం చేకూర్చిందని, ఆ బులెటిన్‌ను కూడా అనర్హత పిటిషన్‌లో సాక్ష్యంగా చేరుస్తామని హరీశ్‌రావు చెప్పారు. ఎమ్మెల్సీ హోదాలోనే ఆగష్టు 15, సెప్టెంబర్ 17న మహేందర్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారని, మార్చ్ 15వ తేదీ నుంచే ప్రభుత్వ చీఫ్ విప్ అని బులెటిన్ ఇచ్చారని ఆక్షేపించారు. ఇతర పార్టీల వారిని మంత్రివర్గంలో తీసుకోరాదని రాజ్యాంగంలో ఎక్కడా లేదని హరీశ్‌రావు తెలిపారు.

## హైదరాబాద్ - విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్




(మొదటి పేజీ తరువాయి)
ప్రభుత్వ కార్యాలయాలు, మంగళవారం నుంచి విద్యాలయాలు ప్రారంభం కానుండటంతో హైదరాబాద్‌కు చేరుకునేందుకు బయలుదేరారు. దీంతో జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. పంతంగిలోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. రద్దీకి అనుగుణంగా టోల్‌బూత్‌లను ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రాంతంలో దసరా, బతుకమ్మ పండుగలు ఘనంగా నిర్వహించుకుంటారు. దసరా సెలవులు కావడంతో, చిన్నా పెద్దా అంతా కలిసి కుటుంబ సమేతంగా హైదరాబాద్ నుంచి తమ స్వస్థలాలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే వాహనాలతో కరీంనగర్ -హైదరాబాద్ జాతీయ రహదారి రద్దీగా మారింది. భాగ్యనగరంలో నివాసం ఉన్న తెలంగాణ ప్రాంత వాసులు స్వస్థలాల నుంచి కార్లు, ఇతర వాహనాల్లో హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. హుస్నాపూర్ టోల్ గేట్ వద్ద వాహనాలతో రద్దీ పెరిగింది. కరీంనగర్ నుంచి వచ్చే మొదటి టోల్ ప్లాజా వద్ద వాహనాలు భారీగా వరుస కట్టాయి. ఫాస్ట్ ట్యాగ్ ఉన్నప్పటికీ వాహనాలు ఎక్కువగా వస్తుండటం వల్ల, టోల్‌గేట్ దగ్గర జాప్యం జరుగుతోంది.

**రుసుము తీసుకోకుండా వాహనాలకు అనుమతి :** సిద్దిపేట జిల్లా రాజీవ్ రహదారి దుద్దెడ టోల్ ప్లాజా వద్ద రద్దీ నెలకొంది. దసరా సెలవులు ముగియడంతో అందరూ హైదరాబాద్‌కు ప్రయాణం కావడంతో టోల్ ప్లాజా వద్ద భారీగా వాహనాల రద్దీ నెలకొని రెండు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. దసరా సెలవులకు హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వెళ్లిన ఉద్యోగులు, వ్యాపారస్తులు విద్యార్థులు తిరిగి భాగ్యనగరానికి సొంత, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం కావడంతో రాజీవ్ రహదారి సిద్దిపేట జిల్లా దుద్దెడ టోల్ ప్లాజా వద్ద భారీగా వాహనాల రద్దీ నెలకొంది. దీంతో టోల్‌గేట్ ఎత్తేసి రుసుము తీసుకోకుండా వాహనాలకు అనుమతి ఇచ్చారు. సాధారణ రోజుల కంటే ఈరోజు మరో లైన్‌ను అదనంగా పెంచినప్పటికీ వెహికల్స్ భారీగా రావడంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి.

## ఎస్‌సీఓ సమ్మిట్‌కు ఏడు దేశాల ప్రధానులు

### భారత్ తరపున విదేశాంగ మంత్రి జై శంకర్



**ఇస్లామాబాద్:** ఇస్లామాబాద్ వేదికగా ఈ నెల 15-16 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సంఘం (ఎస్‌సీఓ) వార్షిక సమావేశానికి ఏడు దేశాల ప్రధానులు హాజరుకానున్నారు. ఈ శిఖరాగ్ర సమావేశానికి భారత్ తరపున కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ హాజరవుతారు. ఈ మేరకు పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. సీహెచ్‌జీ ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. చైనా, రష్యా, బెలారస్, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లకు చెందిన ప్రధాన మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. భారత్ తరపున విదేశాంగ మంత్రి పాల్గొంటున్నారు. ఈ సమావేశంలో ఆర్థిక, వాణిజ్యం, పర్యావరణం, సామాజిక- సాంస్కృతిక రంగాలలో కొనసాగుతున్న సహకారంపై చర్చించనున్నారు. ఎస్‌సీఓ సభ్యదేశాల మధ్య సహకారాన్ని మరింత మెరుగుపరచడం, సంస్థ బడ్జెట్‌ను అమోదించడం వంటి విషయాలపై సమావేశంలో పాల్గొన్న నాయకులు నిర్ణయాలు తీసుకుంటారు.



# వైభవంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

**విశ్వంభర, ముంబయి:** శ్రీ మాత వాహిని ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల ఉత్సావాలల్లో భాగంగా అక్టోబర్ 3 నుంచి ప్రారంభమైన శ్రీ రుద్ర సహిత పరాశక్తి మహా యాగం కార్యక్రమాలు విజయ దశమితో ముగిసాయి. వరాలదేవి కామతీఘర్ కాటేకర్ మైదానంలో పద్మంపై కూర్చున ఆదిపరాశక్తి అమ్మవారిని ప్రతిష్టింపజేసి నిత్య పూజలతో పాటు యాగం, హోమాలు, అభిషేకాలు, కుంకమా అర్చనలు, తదితర విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించడం, వివిధ రూపాలలో అలంకరించిన అమ్మవారిని దర్శించికోవడానికై భక్తులు బారులుతీశారు. ప్రతి దినం అమ్మవారిని రంగురంగుల పూలు, వస్త్రాలతో పాటు విద్యుత్ దీపాలతో అతి శోభాయమానంగా అలంకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పిఠాపురం నుంచి విచ్చేసిన యాగ బ్రహ్మ శ్రీ విద్యాపూర్ణ దీక్షాపతులు, వింజమూరి సుబ్రమణ్యశర్మ బృందంచే శ్రీ లక్ష్మీగణపతి హోమం, శ్రీ రుద్ర హోమం, శ్రీ కాళీ హోమం, శ్రీ సూక్తహవనం, మహాలక్ష్మీ హోమం, శ్రీ తార మంత్ర హోమం, నవగ్రహ హోమం, శ్రీ త్రిపుర సుందరి హోమం, శ్రీ అన్నపూర్ణ హోమం, మహాశార హోమం, భువనేశ్వరి హోమం, త్రిపుర భైరవ హోమం, మన్యుసూక్త హోమం, ఆంజనేయ, సుబ్రహణ్య హోమం, చిన్నమస్తాదేవి హోమం, మేధాసూక్త హోమం, సరస్వతి హోమం, ధూమపతి హోమం, శ్రీ దత్త హోమం, శ్రీ భగళాముఖి హోమం, శ్రీ లలితాసహస్త హోమం, మాతంగి హోమం, శ్రీ చక్రనవావర్ణార్చన, సర్వదేవతా హోమం, కమలాత్మికదేవి హోమం, చండి హోమం, శనివారం రోజున మహాపూర్ణాహుతి ఇలా ఈ పది రోజుల పాటు యాగాలు, హోమాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా తెలుగు భక్తులు సుమారు 3 వందలకు పైగా సాంప్రదాయ దుస్తులను ధరించి లలితాదేవి మాలాధారణ ధరించి నిత్య ఉపవాసాలతో పూజకార్యక్రమాలు ఆచరించారు. ఈ కార్యక్రమాలకు ఎలిగేటి చందన- రాజశేఖర్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవరించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక బీజేపీ భివండీ తూర్పు ఎన్నికల ప్రముఖులు సంతోష్ శెట్టి, పట్టణ అధ్యక్షులు హర్షల్ పాటిల్, ప్రధాన కారదర్శి గాజెంగి రాజు, ఉపాధ్యక్షులు సుమిత్ పాటిల్, మాజీ డిప్యూటీ మేయర్ మనోజ్ కాటేకర్, అఖిల పద్మశాలి సమాజ్ అధ్యక్షులు పొట్టబత్తిని రామకృష్ణ. భివండీ కార్పొరేషన్ కమిషనర్ అజయ్ వైద్య, తదితరులు పాల్గొన్నారు.



# కరాటేలో రాణిస్తున్న బాలుడు మధుసూదన్

**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట కి చెందిన ఎంఎస్ఆర్ స్కూల్ బాలుడు మధుసూధన్ , ప్రత్యక్ష కరాటేలో అత్యంత ప్రతిభను ప్రదర్శిస్తూ రాణిస్తున్నారు. సినీ హీరో సుమన్ "షోటోఖాన్ స్పోర్ట్స్ డు అకాడమీ మాస్టర్ జేవీ రమణ వద్ద గత 6 నెలలుగా కరాటేలో శిక్షణ పొందుతూ ఎల్లో బెల్ట్ సాధించాడు. అలాగే వెపన్స్ లో కూడా ప్రతిభను చూపిస్తున్నారు . సినీ హీరో సుమన్ గారు మధు సుధన్ ప్రత్యక్ష యొక్క ప్రతిభను ఎంతగానో అభినందించారు. ఈసందర్భంగా బాలుడు మధు సూధన్ ప్రత్యక్ష ప్రతిరోజు కరాటే గంటన్నర శిక్షణ చేస్తూ బ్లాక్ బెల్ట్ సాధించటం తన లక్షమని చెప్పారు. చదువుతో పాటు కరాటే నేర్చుకోవటం వలన మైండ్ షార్ప్ తో పాటు ఆత్మరక్షణ ఆరోగ్యం గ వుంటారని . ఈరోజుల్లో కరాటే పిల్లలు



నేర్చుకోవటం చాల అవసరమని మాస్టర్ జేవీ రమణ అన్నారు.

# రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఈడీ నుంచి ఎవరు రక్షిస్తున్నారు?

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ నేతలను ఈడీ నుంచి కాపాడుతున్నది ఎవరని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇటీవల ఓ ధనికుడైన మంత్రి నివాసంలో ఈడీ దాడులు చేసిందని, ఇప్పటి వరకు అందుకు సంబంధించి ఎలాంటి సమాచారం బయటకు రాలేదని ఆరోపించారు. కల్పనకంటే వాస్తవికత వింతగా ఉందని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, అయితే ఇప్పుడు దానిని నమ్మాల్సి వస్తోందని 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. మంత్రి నివాసంలో దాడులు చేసిన సమయంలో రూ.100కోట్ల నగదు పట్టుబడినట్టు మీడియాలో వార్తలు వచ్చాయని ఆరోపించారు. కానీ, ఇప్పటి వరకు కాంగ్రెస్, బీజేపీ, ఈడీ .. ఈ విషయంపై ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. వాల్మీకి కుంభకోణం నుంచి రూ.40కోట్లకు పైగా అక్రమ సొమ్మును ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ ఉపయోగించినట్టు కర్ణాటకలో ఈడీ పేర్కొందని కేటీఆర్ ఆరోపించారు. ఇందులో కూడా ఇప్పటి వరకు ఎలాంటి అరెస్టులు లేవని ధ్వజమెత్తారు.

# ప్రభుత్వం ఇచ్చిన భూమి తిరిగి సర్కారుకే

- ఖర్గే కుటుంబం కీలక నిర్ణయం
- గతంలో సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు ఐదెకరాలు
- ముడా స్కామ్‌పై విచారణ నేపథ్యంలో ఇచ్చేయాలని డిసైడ్

**బెంగళూరు:** కర్ణాటకలో ముడా స్కాం ప్రకంపనలు సృష్టిస్తున్న వేళ.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కుటుంబం కీలక నిర్ణయం తీసుకుంది. ఖర్గే కుటుంబానికి చెందిన సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు గతంలో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ) కేటాయించిన ఐదు ఎకరాల



భూమిని తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నట్లుగా సమాచారం. ప్రస్తుతం మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) స్కాంపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఖర్గే కుటుంబం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.రాహుల్ ఖర్గే నేతృత్వంలోని సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు గతంలో కర్ణాటక ప్రభుత్వం బగలూరులోని హైటెక్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పార్క్ హార్డ్‌వేర్ సెక్టార్‌లో ఐదుకరాల భూమిని మంజూరు చేయడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తోందని బీజేపీ నేత అమిత్ మాలవీయ విమర్శించారు.కర్ణాటక ప్రభుత్వం ఐదెకరాల భూమిని సిద్ధార్థ విహార్ ట్రస్టుకు కేటాయించింది. ట్రస్ట్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, ఆయన అల్లుడు రాధాకృష్ణ, కుమారుడు రాహుల్ ఖర్గే మొదలైన వారు ట్రస్టీలుగా ఉన్నారు. అయితే ఈ స్థలం కేటాయింపులో అవకతవకలు, అవినీతి జరిగిందని ఆరోపిస్తూ దినేష్ కల్లహల్లి అనే వ్యక్తి కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌కు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కర్ణాటక పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ మాట్లాడుతూ రాహుల్ ఖర్గే దరఖాస్తు ప్రకారం అర్హతలు పరీక్షించిన తరువాతే మెరిట్ ఆధారంగా భూమి కేటాయించినట్లు పేర్కొన్నారు.

# పాలనలో ఇబ్బందులుంటే నన్ను సంప్రదించండి

**దిల్లీ:** జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్సీ- కాంగ్రెస్ కూటమి.. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఒమర్ అబ్దుల్లా నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించేందుకు ఏర్పాటు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం అధికారాలు పరిమితంగా ఉండే దిల్లీని తాను పదేళ్లు పాలించానని.. జమ్మూకశ్మీర్ పాలన విషయంలో ఏమైనా సమస్యలు వస్తే తనను సంప్రదించాలని ఒమర్‌కు సూచించారు. ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలు (జమ్మూకశ్మీర్, లద్ధాఖ్)గా విభజించిన విషయం తెలిసిందే. ''జమ్మూకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా మరికొద్ది రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రభుత్వాన్ని నడపడంలో సంపూర్ణ మద్దతు అందిస్తాం. ఆయన నాయకత్వంలో జమ్మూకశ్మీర్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ఆశిస్తున్నాం. ముఖ్యమంత్రికి పరిమిత అధికారాలు ఉన్న కారణంగా దిల్లీని 'హాఫ్ స్టేట్' అని పిలుస్తారు. ఇప్పుడు జమ్మూకశ్మీర్‌నూ ఇలాగే మార్చేశారు. ఎన్నికైన ప్రభుత్వానికంటే లెఫ్టినెంట్



గవర్నర్‌కే అధికారాలు ఎక్కువ. ఈ నేపథ్యంలో పాలనాపరంగా ఏదైనా సమస్య ఎదురైతే నన్ను సంప్రదించండి. దిల్లీ సీఎంగా పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపాను'' అని దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో దోడా స్థానం నుంచి విజయం సాధించిన ఆప్ ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్‌కు ఓటు వేసినందుకు ప్రజలకు కేజ్రీవాల్ ధన్యవాదాలు చెప్పారు. ఆదివారం దోడాలో పర్యటించిన ఆయన.. తాము అభివృద్ధిని మాత్రమే కాంక్షిస్తున్నామని.. ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీఎంలు లేదా ప్రధానమంత్రి కావాలనే రేసులో లేమని తెలిపారు. కొత్త తరహా రాజకీయాలకు 'ఆప్' పేరు పొందిందని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమన్నారు.










# దేశ రక్షణ పరిశోధనలకు ఆద్యుడు సూరి భగవంతం

**తెలుగు జాతి కీర్తిని విశ్వవ్యాపితం చేసిన గొప్ప శాస్త్రవేత్త.., నేడు ఆయన జయంతి**

**సూరి భగవంతం ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనలకు ఆద్యుడు. ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909న జన్మించారు. ప్రాథమిక విద్యా భ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి. ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందుకున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేధో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు.**





ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. బోధనా విధానంలో ఈయనది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభలన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తన 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎస్సి డిగ్రీ ప్రదానం చేసింది. ఆయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు.

భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్రోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయవంతంగా నడిపారు. 1948-49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు.

1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వ విద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు. ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా-భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు. భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు.

1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరెక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంతమైన పనిముట్టుగా రూపొందిం చారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠపరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండమైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరీలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు.

డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్స్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్ (ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు.

దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్. బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు. దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవాలని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతంకు మన దేశం సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

భౌతిక శాస్త్ర రంగంలో మూడు ప్రామాణిక గ్రంథాలను, అనేక పరిశోధనా పత్రాలను వెలువ రించారు. రామన్ ఎఫెక్ట్ అంశం మీద వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. పునః పరిశోధనలు జరిపారు. "మాలిక్యులర్ లాటిస్ వైబ్రేషన్" అంశం మీద గ్రూప్ థియరిటికల్ అప్లికేషన్స్, వాయువుల గూర్చి రామన్ ఎఫెక్ట్ కు సంబంధించిన పరిశోధనలు మీద సునిశిత కృషి జరిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ లలో ఫెలోషిప్ మీద పరిశోధనలు నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ వారి భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా (1946) వ్యవహరించారు. "1961 లో క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్" అనే బృహత్తర గ్రంథ రచన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. కమిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద డెవలపింగ్ కంట్రీస్ అధ్యక్షులుగా సి.వి.రామన్ పరిశోధించిన రామన్ ఎఫెక్టు అంశం మీద ప్రామాణిక పరిశోధనలు చేసిన అద్వితీయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. రామన్ ఎఫెక్ట్, క్రిష్టల్ స్ట్రక్చర్ మొదలగు అంశాల మీద అవిశ్రాంత పరిశోధనలు జరిపి గ్రంథ రచనలు చేశారు. ఆయన 300 పైగా పరిశోధనా పత్రాలను వెలువరించారు. గ్రూప్ థీరీ, రామన్ ఎఫెక్టు అనే రెండు ఉత్తమ గ్రంథాలను కూడా చేశారు. ఇవి ప్రామాణిక గ్రంథాలుగా అంతర్జాతీయ ఖ్యాతిని పొంది, అనేక భాషలలోకి అనువదించటం జరిగింది. జాతీయ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్, ప్రొఫెషనల్ సంస్థలు అనేకంలో ఆయన ఎలెక్టెడ్ ఫెలోగా ఉన్నారు. పలు యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి.సి.వి.రామన్ అనుంగు శిష్యునిగా, దేశ రక్షణ శాఖను బలోపేతం చేసిన దేశభక్తునిగా పేరొందిన ప్రొఫెసర్ భగవంతం తన 80 వ యేట 1989, ఫిబ్రవరి 6 వ తేదీన మరణించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# నేతన్నల జీవితాలు మారాలి.. పునర్వైభవం రావాలి

**ఆటుపోట్లతో కొనసాగుతున్న సిరిసిల్ల నేత కార్మికుల బతుకుచిత్రం**



**చేనేత పరిశ్రమ, చేనేత కళాకారులు, కార్మికులు అనగానే మనందరికీ గుర్తుకు వచ్చేది తెలంగాణ రాష్ట్రంలోని సిరిసిల్ల. అయితే సిరిసిల్ల పట్టణంలో సుమారు 30 నుంచి 40వేల వరకు చేనేత కుటుంబాలు చేనేత వృత్తిపై జీవిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నాయి. దశాబ్దాలు గడుస్తున్నాయే గానీ ఈ నేతన్నల దశ మాత్రం మారడం లేదు. వారి బతుకు వాకిట్లోకి తొంగిచూస్తే ఎన్నో దైన్యపు చూపులు కనిపిస్తున్నాయి. చితికిన బతుకు చిత్రాలు దర్శనమిస్తున్నాయి నేతన్నల కుటుంబాల ముఖాల్లో ఇంకిపోయిన కన్నీటి చారల విషాద ఛాయలు కనిపిస్తున్నాయి. సిరిసిల్ల నేత రంగంలో ఇటీవల సంక్షోభం ఏర్పడిందని పతాక స్థాయిలో వార్తలు వస్తున్నాయి.ప్రస్తుతం వారి పరిస్థితి మరింత దుర్భరంగా దీన పరిస్థితిలోకి మారిందని తెలుస్తోంది.స్థూలంగా చెప్పాలంటే కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల ముఖచిత్రం ప్రస్తుతం బోసిపోయింది.**

సిరిసిల్ల అంటేనే తెలంగాణలో అతిపెద్ద వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా ఎంతో ప్రత్యేకమైనది. వేల సంఖ్యలో కార్మికులు మరమగ్గాలపై వస్త్ర ఉత్పత్తి సాగిస్తారు. ఇక్కడ చేనేత మగ్గాలపై ఒకప్పుడు వస్త్ర పరిశ్రమ కుటీర పరిశ్రమ ఉండేది. కాలానుగుణంగా మరమగ్గాలుగా ఇంగ్లీష్ లూమ్‌లు ,సురూ, గఫూర్, రమేష్, మేకర్లు, కండెలు చుట్టే మిషన్లు, సైజింగ్లు, వార్పింగ్ మిషన్లు, ట్విస్టింగ్ మిషన్ లు, రేపర్ లూమ్‌లు, ఇలా ఆటోమేటిక్ మర మగ్గాలు అనేక రకాలుగా వారి వారి ఉత్పత్తులకు అనుగుణంగా నిర్మించుకున్నారు. యజమానులు, ఆసాములు, కార్మికులుగా మూడు తరహాలుగా విభజితమయ్యారు. ఇలా ఉత్పత్తి అయిన వస్త్రాలను సిరిసిల్లలో డయింగ్ వ్యవస్థ అంటే ఉత్పత్తి అయిన కాటన్ గుడ్డ అద్దకంతో కేస్మేట్, పాప్లిన్ వస్త్రాలుగా తయారవుతాయి. ఆర్డర్ పై పెట్టికోట్స్, సారీస్, బ్లౌజ్ పీస్ లు పలు గార్మెంట్లుగా సరఫరా చేస్తూ వస్త్రోత్పత్తిదారులు నేరుగా అమ్మకందారులుగా మారారు. వివిధ రాష్ట్రాలతో వ్యాపార సంబంధాలు కుదుర్చుకొని అమ్మకాలు జరుపుతున్న నేపథ్యం ఒక కోణం అయితే, అందులో పాలిస్టర్ వస్త్రాన్ని తయారుచేయడం మరో విభాగం అని చెప్పవచ్చు. పాలిస్టర్ గుడ్డను తయారీ విషయంలో బోస్ కి, లైనింగ్, షూటింగ్, షర్టింగ్ , సారీస్ గ్రే ఇలా పలు రకాలుగా తయారు చేసి హైదరాబాద్ ఏజెంట్ల ద్వారా, యజమానులకు అమ్మి దానిని ప్రాసెసింగ్ తో ఫినిషింగ్‌గా సిల్క్ మిల్లుల ద్వారా ఏర్పడి అనేక హోల్సేల్, రిటైల్ దుకాణాలకు సప్లై జరుగుతున్నాయి. కాటన్ వ్యవస్థ, పాలిస్టర్ వ్యవస్థ రెండు విభాగాలుగా సిరిసిల్లలో ఉంది. మరమగ్గాల వస్త్ర పరిశ్రమలో వేల సంఖ్యలో కార్మికులు, వందల సంఖ్యలో ఆసాములు, యజమానులు ఉత్పత్తి రంగంలో మనుగడ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఒకవైపు ఉపాధి, మరోవైపు నైపుణ్యం, కళాత్మకత వివిధ రకాలుగా అంతర్లీనంగా ప్రాముఖ్యతను సంతరించుకొని అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నది. అందుకు ప్రధాన కారణం ఉత్పత్తిదారుడే అమ్మకందారుడుగా మారి తయారుచేసిన గుడ్డను విక్రయించడం. యజమాని నేరుగా మార్కెట్ సెంటర్లలో కొందరు నేరుగా, మరికొందరు ఏజెంట్ల ద్వారా అమ్మకాలు జరిపిన తరుణంలో అక్కడి మార్కెట్ పరిస్థితుల ప్రభావంతో దేశంలోనే అతిపెద్ద ఉత్పత్తి కేంద్రాలుగా పేరుగాంచిన తిరుపూర్, సూరత్, అహ్మదాబాద్, సోలాపూర్ లతో పోటీకి ధీటుగా నిలిచే ప్రయత్నాలు చేసినా సిరిసిల్ల వస్త్ర యజమానుల వస్త్ర ఉత్పత్తులు అంతగా నిలువలేకపోయాయి. దానికి ప్రధాన కారణం ఏదేని ఒక వస్త్ర పరిశ్రమకు కావలసిన రవాణా మార్గాలైన ప్రధాన రైల్వే మార్గాలు , అతిపెద్ద అంగడి మార్కెట్లు చేరువలో లేక పెద్ద మొత్తంలో భారాన్నిమోస్తున్నది. దిగుమతి విషయంలోగాని, ఎగుమతి చేసే విషయంలో కానీ ప్రధాన పోటీ ఇవ్వలేకపోయింది. అయినా సిరిసిల్ల ప్రాంతంలో అతిపెద్ద సామాజిక వర్గం పద్మశాలి వర్గం ఉండడం వల్ల వారికి ప్రధాన వృత్తి చేనేత వృత్తి అవ్వడం వల్ల ఆటుపోట్లు ఎదుర్కొన్నా గానీ నమ్మిన వృత్తిని వదలక, మరో కొత్త వృత్తిలో అనుభవం లేక ఒక్కోసారి తీవ్ర విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నది. అప్పుడు నమ్ముకున్న వృత్తితో వారి జీవనం గడపలేక ఆత్మహత్యలు చేసుకున్నారు కూడా.

ఆ సమయంలో తగినంత సహాయం సిరిసిల్లకు ఎంతైనా అవసరం అని భావించి పలు ఉపాధి పథకాలు కార్మికులకు, ఆసాములకు, యజమానులకు ప్రభుత్వాలు కల్పించాయి. తెలంగాణ రాష్ట్రం సిద్ధించక ముందు చేనేత కార్మికులు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకున్న ఆ సమయంలో అప్పటి ప్రభుత్వ అధికారులు గోడలపై జోట కూసున్నదని ఊరుకోకు, పూట గడుస్తలేదని ఉరి వేసుకోకు అని రాయించిన సందర్భాలు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుండి బస్సులలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు చూసి ఏమిటి ఈ పరిస్థితి అని చాలా మంది ఆలోచించేవారు. చేనేత కార్మికుల ఆత్మహత్యలు జరుగుతున్న సందర్భాన్ని అప్పట్లో గ్రహించిన సినీ నటుడు చిరంజీవి సిరిసిల్లకు విచ్చేసి ఇలాంటి పరిస్థితుల్లో మీరు ఉన్నారా? అంటూ నేత కార్మికులను ఉద్దేశించి సానుభూతి చూపించారు. పలు సమస్యలకు పరిష్కార దిశగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం "బతుకమ్మ చీరల తయారీ" పథకాన్ని రూపొందించి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో వెలుగులు నింపే ప్రయత్నం చేసింది.

### మార్పు దిశగా "బతుకమ్మ చీరల తయారీ పథకం "

దశాబ్దాల నుండి యజమానులు, ఆసాములు, కార్మికులు , ప్రధానంగా పద్మశాలి వర్గం ఉత్పత్తిని కొనసాగిస్తున్నది. బతుకమ్మ చీరల తయారీ సంవత్సరంలో ఎక్కువ రోజులు పని కల్పించింది. పెద్ద మొత్తంలో నేత అనుబంధ సంఘాలలో అనేక మార్పులుగా మ్యాక్స్ సొసైటీలుగా ఏర్పడి ప్రభుత్వ ఆర్డర్లను తయారుచేసి గతంలో కంటే చీరల ఉత్పత్తిపై సిరిసిల్ల నేత కార్మిక వర్గం ఎక్కువగా సుముఖత చూపింది.

### నేత కళాత్మకత ఒక ప్రత్యేకం

నేతతో అనేక కళాత్మకాలను సృష్టించిన ఘనత కూడా సిరిసిల్ల వాసులకే దక్కింది. అగ్గిపెట్టెలో అమర్చేంత చీరను తయారుచేసిన కళాకారులు సిరిసిల్ల లో ఉండడం యావత్ ప్రపంచాన్ని ఆలోచింపజేసింది. సిరిసిల్ల ప్రాంత నేత కళాకారులకు తర్ఫీదు ఇప్పిస్తే మరిన్ని నూతన ఆవిష్కరణలను చూసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

### కాటన్ పరిశ్రమను కాపాడాలి!

వస్త్రోత్పత్తికి అనుబంధంగా నిలిచిన సైజింగ్ పరిశ్రమ, అద్దకం పరిశ్రమ సమస్యలపై ఇటీవల కాటన్ వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక ఆవేదన వ్యక్తం చేసింది. కళాత్మకత సృజన కలిగిన కార్మికులకు చేయూత అవసరమని, అందుకు ప్రభుత్వ ఆర్డర్లు ఆవశ్యకమని తెలుపుతూ ఇటీవల దసరా పండుగ సందర్భంగా కాటన్ ప్రభుత్వ చీరలు రావాలి! కాటన్ పరిశ్రమను కాపాడాలి!! అంటూ ఫ్లెక్సీలతో సిరిసిల్లలో అనుబంధ సంఘాల ఆవేదనను వ్యక్తం చేయడం గమనించదగ్గ విషయం.

### సిరిసిల్లకు ప్రభుత్వ పథకాలే ఆధారం

దశాబ్దాల చరిత్ర కలిగిన సిరిసిల్ల నేత కార్మికులు ఉపాధి విషయంలో శాశ్వత పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు. నేటి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి వస్త్రోత్పత్తికి అవసరమైన యార్న్ డిపో ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకోవడంతో నేత ఉత్పత్తులపై ఆశలు చిగురించాయి. రెక్కాడితే గానే డొక్కాడని జీవితాలను గడుపుతున్న నేత కార్మికులపై గతంలో ఉత్పత్తి, మార్కెట్ మాంద్యంలాంటి అనేక పరిస్థితుల ప్రభావం పడింది. ఆ పరిస్థితుల మార్పు కోసం మొదటగా "బతుకమ్మ చీరల తయారీ పథకం " గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. నేడు "యార్న్ డిపో" ద్వారా వస్త్ర ఉత్పత్తికి ప్రధాన భాగంగా నిలిచే నూలును ప్రభుత్వం అందించే ప్రయత్నం చేసింది. సిరిసిల్ల చేనేతన్నల ఆశాభావం నిజం కావాలని, వారి జీవితాలలో పలు మార్పులు రావాలని ఆశిద్దాం.



- డా.చిటికెన కిరణ్ కుమార్
కవి, రచయిత, విమర్శకుడు
సెల్ : 9490841284

# బూరుగు రంగయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం రహీంఖాన్ పేట గ్రామములో బూరుగు రంగయ్య అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. వారి కుటుంబానికి రహీంఖాన్ పేట మాజీ ఎంపీటీసీ దుంప సుజాత వెంకటేష్ 10,000/లు, కేహేచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి 5000/లు రూపాయల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుదగాని లింగయ్య, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు కర్రే అయిలయ్య, బూడిద మహేష్, కర్రే మల్లయ్య, దుంప యాదగిరి, దుంప శివయ్య, కర్రే శ్రీను, ఖమ్మంపాటి సోమరాజ్, బురుగు రంగయ్య, గుణగంటి శంభు లింగం, తాళ్ల పల్లి సత్తయ్య, దుంప సురేష్, దుంప ప్రవీణ్ పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

# బోగోజు భాస్కరాచారికి ఘనంగా సన్మానం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, నీర్నెముల గ్రామానికి చెందిన బోగోజు భాస్కరాచారి ఉపాధ్యాయ వృత్తిలో 27 సంవత్సరాలు ఎంతో మందికి విద్యను అందించి, ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా, బోగోజు భాస్కరాచారిని, నీర్నెముల ఎంప్లాయిస్ అసోసియేషన్ వారు ఇరువురు దంపతులను శాలువతో సత్కరించి, ఘన సన్మానం చేశారు. గ్రామానికి చెందిన సుర్వి కిష్టయ్య, సుర్వి పద్మల కుమార్తె సుర్వి శ్రీలేఖ ఇరిగేషన్ డిపార్ట్మెంట్లో ఏఏఈగా ఉద్యోగం సాధించింది. ముత్యాల లింగయ్య, ముత్యాల రాణిల కుమార్తె ముత్యాల నవ్య ఇటీవల ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్స్ గా ఉద్యోగం సాధించడం జరిగింది. వీరిని కూడా ఎంప్లాయిస్ అసోసియేషన్ ఘనంగా శాలువాతో సత్కరించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నోముల యాదగిరి, కోశాధికారి సుర్వి శ్రీనివాస్, గౌరవ సలహాదారులు నోముల నర్సయ్య, నాగటి సోములు, మాజీ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఆవుల ఎల్లయ్య, గంగుల రాంరెడ్డి, దొంతరబోయిన దైవాదీనం, దొంతరబోయిన వెంకటేశం, దొంతరబోయిన రమేష్, ఆవుల విష్ణు, ముత్యాల రవి, ముత్యాల మహేష్, గ్రామ పెద్దలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

# శమీ పూజలో పాల్గొన్న పాతూరి వెంకట్ రావ్



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో సుజీవన్ వావిలాల ఏర్పాటుచేసిన దుర్గామాత మంటపం దగ్గర వేద పండితులు రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో శమీ పూజ (జమ్మి) ఘనంగా నిర్వహించారు. శమీ పూజ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త పాతూరి వెంకట్ రావ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాఘవేంద్ర కాలనీ అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు కాశన్న సార్, సుధాకర్ సేట్ ,విక్రమ్ యాదవ్, చాకలి శ్రీనివాస్, రామ్ రంజన్, భైరమోని మహేష్, చాకలి రమేష్, శ్రవణ్ అన్నయ్య, బిట్ల సత్యం మంతెన రమేష్, గుడ్డు సల్ల మహేష్, కొండారెడ్డి, అబ్బి గోపి, రామ్ దాస్, శ్రీనివాస్ రెడ్డి, సందీప్ సాయి, నెహ్రు, వంశీ, శ్రీరామ్ వంశీ సిద్ధు ప్రేమ్ చేతన్, మణికంఠ, నాగభూషణం, కౌశిక్, నందిగామ బ్రదర్స్ రాఘవేంద్ర శివ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం వర్టూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులకు దసరా పండుగ సందర్భంగా సుదగాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్ గౌడ్ ,మాజీ సర్పంచ్ సుదగాని సత్తమ్మ రాజయ్య గౌడ్ల చేతుల మీదుగా గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదగాని రామదాసు గౌడ్ , నెమ్మని సుబ్రహ్మణ్యం , వై రాజిరెడ్డి ,మాధవ రెడ్డి , వై వెంకట్ రెడ్డి , గువ్వ ఎల్లయ్య , తిరుపతి , పల్లె మైసయ్య , కాదూరి శ్రీను , పల్లె నరేష్ , కె.అశోక్ , కె నర్సింహ్మలు , పల్లె మహేందర్ , పల్లె మైసయ్య , జనగాం బాలయ్య , నోముల రమేష్ , కర్రె శ్రీను , కొత్త క్రిష్ణ , గువ్వ మల్లయ్య , పల్లె మల్లయ్య, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



## కొండారెడ్డిపల్లిలో

# దసరా సంబురాల్లో సీఎం రేవంత్ రెడ్డి

- సీఎం అయిన తర్వాత తొలిసారి కొండారెడ్డిపల్లికి రాక
- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన సీఎం
- చిన్ననాటి మిత్రులు, శ్రేయోభిలాషులను కలిసిన సీఎం



**విశ్వంభర, కల్వకుర్తి:** నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామమే మన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామం. ఆయన దసరా పండుగ సందర్భంగా కొండారెడ్డిపల్లికి సీఎం రేవంత్ రెడ్డి విచ్చేసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి గ్రామానికి వచ్చిన రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యేలు, కాయితి ఆశాదీప్ రెడ్డి ఘనంగా స్వాగతం తెలిపారు. గ్రామంలో పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తూ 45 లక్షలతో పశువైద్యశాల , 60 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, 50 లక్షలతో బీసీ సంక్షేమ భవనం, 50 లక్షలతో అమర్ జవాన్ యాదయ్య స్మారక గ్రంథాలయం భవనం ఇలా 3 కోట్ల రూపాయలతో నిర్మించిన పనులు ప్రారంభించారు. దాదాపు మరో 18 కోట్లతో చేపట్టిన శ్రీశైలం హైవే నుండి కొండారెడ్డిపల్లి గ్రామ శివారు వరకు నాలుగు లైన్ల రహదారి పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. 90 లక్షల రూపాయలతో పాలశీతకరణ కేంద్రం మరియు 10 కోట్ల తో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. అదేవిధంగా కొండారెడ్డిపల్లి గ్రామంలో సోలార్ వెలుగులు నింపేందుకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అందులో భాగంగా రైతులకు సోలార్ పంపు సెట్లను ఉచితంగా అందజేశారు. మరో 15 కోట్లతో గ్రామాన్ని సోలార్ విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దారు. అనంతరం గ్రామస్తులు, చిన్ననాటి మిత్రులతో కొద్దిసేపు మాట్లాడారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక తమ గ్రామానికి నిధుల వరద పారి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్, కేవీయన్ రెడ్డి, భూపతి రెడ్డి, బచ్చు రామకృష్ణ, తదితర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# సబితా ఇంద్రారెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపి నాయకులు





**విశ్వంభర, మహేశ్వరం/ మీర్ పేట్:** మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్.సీ.ఐ రోడ్డులో గల యం.యల్.ఏ క్యాంప్ ఆఫీసు నందు దసరా పండుగను పురస్కరించుకొని తన అభిమానులకు అందుబాటులో ఉన్న మాజీమంత్రి, మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి కలిసి దసరా శుభాకాంక్షలు జమ్మి ఆకును బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మీర్ పెట్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ యం.దుర్గా దీపలాల్ చౌహాన్ , ఫ్లోర్ లీడర్ శ్రీ అర్కల భూపాల్ రెడ్డి , కార్పొరేటర్లు. మేకల విజయలక్ష్మి రవీందర్ రెడ్డి, సిద్ధాల లావణ్య బీరప్ప, బొక్క రాజేందర్ రెడ్డి, బి.ఆర్.యస్ పార్టీ ముఖ్య నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిరూర్ బాలరాజు, దిండు మహేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**శుభాకాంక్షలు తెలిపిన అరవింద్ శర్మ**

జిల్లెల గూడ క్యాంపు కార్యాలయం లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని కలిసి దసరా శుభాకాంక్షలు మహేశ్వరం నియోజక వర్గం బీ ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో నెంటూరి రవీందర్ రెడ్డి , పెండ్యాల నగేష్, న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, శ్రీమాన్ నారాయణ, సాజిద్, మహేందర్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి లు పాల్గొన్నారు.


# లయన్ సేవలను మరింత విస్తృత పరుస్తాం

**-అధ్యక్షులు లయన్ పసుల లక్ష్మారెడ్డి**



**విశ్వంభర, ఆమనగల్లు:** లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో లయన్స్ సేవలను మరింత విశిష్ట పరుస్తామని ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. కల్వకుర్తి లయన్ భవన్లో లయన్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంవత్సరిక ప్రణాళికను క్లబ్ అధ్యక్షులు సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆమనగల్లు కు అంతర్జాతీయ స్థాయిలోనే అగ్ర భాగాన నిలుపుతామని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సంవత్సరకాలంలో నియోజకవర్గ స్థాయిలో పాఠశాలలో వాటర్ ట్యాంకులు, విద్యార్థి విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని ఆయన తెలిపారు. లయన్స్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న క్లబ్ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఐ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి, కార్యదర్శి దునాదుల మహేష్, కోశాధికారి గుజ్జరి నరసింహ, జిల్లా కోఆర్డినేటర్స్ కె రామ్ రెడ్డి, బండెల రామచంద్రారెడ్డి జిల్లా చైర్మన్ జూలూరి రమేష్, భావాండ్ల వెంకటేష్, జూలూరి లింగయ్య, విష్ణువాస్ రెడ్డి, లైన్స్ క్లబ్ సభ్యులు పి. వెంకట్ రెడ్డి, బైరి కరుణాకర్ రెడ్డి, అల్వాల్ రెడ్డి, జంగారెడ్డి, కర్నాటి కొండల్ రెడ్డి, కందేసత్యం, మోహన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లయన్స్ క్లబ్ పిఆర్ఓ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# గన్‌తో కాల్చుకుని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



**విశ్వంభర, మహబూబాబాద్:** గన్‌తో కాల్చుకుని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్‌లో చోటు చేసుకుంది. కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాస్ గన్‌తో కాల్చుకున్నాడు. పేలు శబ్దం విని సమీపంలో ఉన్న సిబ్బంది వచ్చి చూడగా అప్పటికే రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. శ్రీనివాస్ గత ఐదేళ్లుగా కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్నాడు. ఒంటరితనం కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. ఘటనా స్థలిని జిల్లా ఎస్పీ పరిశీలించారు. పూర్తి విచారణ అనంతరం వాస్తవాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు.



తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడిగా ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనచారి ని శాసన మండలి లో కలిసి పూల బొకే తో సన్మానం బీ ఆర్ ఎస్ రాష్ట్రా నాయకులు మారోజు రామాచారి చేశారు. ఆయనతోపాటు తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గోర శ్యామ్ సుందర్ గౌడ్ లు తదితరులు పాల్గొన్నారు.

(విశ్వంభర, ఎల్బీనగర్)

# చుక్కల ఉదయ్ చందర్ సేవలు మరువలేనివి



**విశ్వంభర, మహబూబాబాద్:** టీపీసీసీ ప్రతినిధి కీ.శే చుక్కల ఉదయ్ చందర్ దశదినకర్మ మహబూబాబాద్ పట్టణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్, మహబూబాబాద్ జిల్లా పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ , మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ , జిల్లా నాయకులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో విషాదం

**ఇద్దరు పిల్లలను బావిలో తోసివేసి.. ఆపై తల్లి ఆత్మహత్య**

**విశ్వంభర, కామారెడ్డి :** కామారెడ్డి జిల్లాలో విషాదం నెలకొంది. ఇద్దరు పిల్లలను బావిలో తోసివేసి ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన తాడ్వాయి మండలం నందివాడ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చిట్టెమ్మ శ్రీనివాస్ రెడ్డి(38) తన పిల్లలు విగ్నేష్(6) అనిరుథ్(7)లను బావిలో తోసివేసి ఆపై తాను కూడా అందులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలను హత్య చేసి తాను ఆత్మహత్య చేసుకున్నట్టుగాపోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. బావిలో నీళ్లు అధికంగా ఉండడంతో బురద ఊబిలో శ్రీనివాస్ రెడ్డి మృతదేహం కూరుకుపోయింది. ఇద్దరు పిల్లల మృతదేహాలు బావిలో తేలియాడాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# దుర్గా మాత నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ మండల కేంద్రంలోని పర్వతగిరిలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన సోమ్లు తండాలో శ్రీ దుర్గామాత నవరాత్రుల సందర్భంగా పూజా కార్యక్రమంలో కమిటీ సభ్యులతో కలిసి శ్రీ దుర్గామాతకు మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్ , ఆయన సోదరులు భూక్యా దాల్ సింగ్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ దుర్గ మాత అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తండా మాజీ ఎంపీటీసీ, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, అలాగే కమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి రూ.లక్ష 16 వేల ఆర్థిక సాయం

**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పసుల శివ కొద్ది కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆదివారం మరణించాడు. ఈ విషాద వార్త తెలుసుకున్న మిషన్ భగీరథ మాజీ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ పసుల శివ కుటుంబానికి 1,16,000 రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు. అదేవిధంగా పసుల శివ ఇద్దరు పిల్లల చదువుల బాధ్యతను స్వయంగా తీసుకుంటానని హామీ ఇచ్చారు. తద్వారా తను మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంలో గ్రామ ప్రజలు మరియు బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా కుటుంబానికి తమ మద్దతు అందిస్తూ సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, కటికల శేఖర్, అశోక్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మాదిగ దండోరా జెండా ఆవిష్కరణ

- ముప్పై ఏండ్లుగా కొట్లాడి వర్గీకరణ పట్ల అనుకూల తీర్పు సాధించాం
- యస్సీ వర్గీకరణ అమలుకు ఉద్యమం సాగిస్తాం
- కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే యస్సీ వర్గీకరణ అమలు చేయాలి
- ఎంఎస్ పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్రస్వామి మాదిగ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూర్ (ఎం) మండలం పల్లెపహాడ్ గ్రామంలో విజయ దశమి సందర్భంగా వివిధ సామాజిక ,విప్లవ, రాజకీయ ఉద్యమాలలో అశువులు బాసిన అమరవీరుల స్మారకార్థం ప్రతి సంవత్సరం సామాజిక, ఉద్యమ, రాజకీయ జెండాలు గ్రామంలో ఎగుర వేయడం జరుగుతుంది. అందులో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థపాక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తున్న మాదిగ దండోరా (ఎమ్మార్పీఎస్ ) పల్లే పహాడ్ గ్రామ శాఖ జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా యంయస్ పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ ముప్పై ఏండ్లుగా మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో యస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసి న్యాయం కోసం కొట్లాడి అత్యున్నత సుప్రీం కోర్టు నుండి వర్గీకరణ పట్ల అనుకూల తీర్పు సాధించాం అని తక్షణమే తెలంగాణలో యస్సీ వర్గీకరణ అమలు చేయాలనీ కమిటీలు, కమిషన్లతో కాలాయాపన చేయొద్దని వర్గీకరణ అమలు అయ్యే దాకా ఎంపిక పరీక్షల, ఉద్యోగాల భర్తీ నిలుపుదల చేయాలనీ అన్నారు.
ఈ కార్యక్రమంలో యం ఎస్ పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎం ఆర్ పీ ఎస్, ఎం ఎస్ పీ మండల, గ్రామ శాఖ నాయకులు పందుల భిక్షపతి మాదిగ, శ్రీరాములు మాదిగ, గజ్జెల్లి పవన్ మాదిగ, జీడీ ఎలందర్ మాదిగ,గజ్జెల్లి శంకర్ మాదిగ, యాదగిరి మాదిగ, పరుశరామ్ మాదిగ, చంద్రయ్య మాదిగ, మహేష్ మాదిగ, క్రాంతి మాదిగ తదితర నాయకులు పాల్గొన్నారు.

## 68వ బుద్ధ పరిపూర్ణ అశోక విజయదశమి వేడుకలు

* ఘనంగా నిర్వహించిన నాంచారిపేట గ్రామస్తులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం నాంచారిపేట గ్రామంలో శనివారం 68వ బుద్ధ పరిపూర్ణ అశోక విజయదశమి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గంధమల్ల నరేష్ సామ్రాట్ మాట్లాడుతూ అశోకుడు రాజ్యాంగ విస్తరణలో భాగంగా కలింగులపై దండయాత్ర చేయడం జరిగింది. ఆ యుద్ధంలో వేలమంది చనిపోవడం జరిగింది. లక్షకు పైగా శతగాత్రులు అయ్యారు. ఆ మారణహోమం సృష్టించిన యుద్ధంలో నెత్తురు ఏరులై పారుతుంటే చూసి చెలించి పోయిన అశోకుడు ఖడ్గం వదిలేసి శాంతి స్థాపనకై బౌద్ధ మతాన్ని స్వీకరించడం జరిగింది. బుద్ధుడు బోధించిన అష్టాంగ మార్గాన్ని రాజ్యం మొత్తం విస్తరింపచేసి రాజ్యంలోని ప్రజలందరినీ తన పిల్లలని ప్రకటించాడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దసరా పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెపాడ్ గ్రామంలో దసరా పండుగ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యని గ్రామస్థులు మండల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా కోలాటం డప్పు చప్పులతో స్వాగతం పలికారు. దసరా పండుగ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో కలయ తిరుగుతూ గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. ఆ తర్వాత బుర్జు వద్ద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేశారు. గతంలో అదే జెండా కార్యక్రమంలో గ్రామ ప్రజలు మీరు ఎమ్మెల్యేగా గెలవాలని కోరగా ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచి జెండా పండుగలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## కోహెడ.. రెడ్డి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కోహెడ గ్రామంలో 12 మంది సెలక్షన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన రెడ్డి సంక్షేమ సంఘం పాలకవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడు బద్దం కృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామిడి జంగా రెడ్డి, ఉపాధ్యక్షులు కొత్త రాజిరెడ్డి, నల్ల యాదిరెడ్డి, కోశాధికారి సింగిరెడ్డి రాం రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఏనుగు వెంకట్ రెడ్డి, క్రీడలుసాస్కృతిక శాఖ కళ్ళెం సాయికిరణ్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా సామల వెంకట్ రెడ్డి, కళ్ళెం బాల్ రెడ్డి, సామ ధన్ పాల్ రెడ్డి, గజ్జల దాన్ రెడ్డి, తీగల శ్రీనివాస్ రెడ్డి, యంజాల బాల్ రెడ్డి, కొత్త రాం రెడ్డి, రామిడి మోహన్ రెడ్డి లు నియమించబడ్డారు. ఈ కమిటీ తదుపరి ఎన్నికల వరకు కొనసాగుతుందని సంఘం అభివృద్ధి కోసం 25లక్షలు విరాళం అందించిన సామల కమలమ్మ నారాయణ రెడ్డి కుమారులు సామల సంతోష్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు, రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## మధుసూదనా చారికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే

**విశ్వంభర, షాద్ నగర్:** తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేతగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ మధుసూదన చారి కి షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విదంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్ప గుచ్చాలను అందజేశారు. అనంతరం దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.







## దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వరి దేవి ఆలయం వద్ద శరన్న నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో దుర్గామాత పూజలు నిర్వహించగా రావణాసురుని విగ్రహాన్ని కాల్చారు. రావణాసురుని వద సమయంలో వివిధ రకాల టపాకాయలతో ఆనందంగా జరుపుకున్నారు . దసరా పండగ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించుకుని అందరికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అమ్మవారి ఆశీర్వాదంతో దుర్గామాత కృప వలన మహేశ్వరం ప్రజలంత సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు , గ్రామ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత, విశ్వాసానికి బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ ప్రతీక

**విశ్వంభర, బషీర్ బాగ్ :** నాణ్యత, విశ్వాసానికి బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ ప్రతీక అని సినీ నటి ఐశ్వర్య మీనన్ తెలిపారు. హైదరాబాద్ లోని నోవాటెల్ హెచ్ఐసీసీలో 474వ గ్రాండ్ టాలెంట్ అవార్డుల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గ్రూప్ ఇళ్లను నిర్మించడమే కాకుండా భవిష్యత్తును నిర్మించడంలో కూడా ముందుందని చెప్పారు. బీబీజీ బృందం అంకితభావం ప్రశంసనీయం అన్నారు. మహిళా సాధికారత పట్ల చూపిస్తున్న శ్రద్ధ అమోఘమన్నారు. వ్యాపారంతో పాటు సమాజం పట్ల ఉన్న బాధ్యతకు ఇది నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ సీఎండీ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ బీబీజీ బంగారు తల్లి లక్ష్యం మహిళలను ఉన్నత స్థానంలో చూడటమేనన్నారు. అందులో భాగంగా 2040 నాటికి ఇరవై లక్షల మంది మహిళలకు సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇక వ్యాపారంలో ఇప్పటి వరకు 240 ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు. లక్షా ఇరవై ఐదు వేల మంది కస్టమర్ల కళ్లలో ఆనందాన్ని చూశామన్నారు. 2040 నాటికి మరో 10 లక్షల మంది భారతీయులు సొంతంగా ప్లాట్లను పొందేందుకు ప్రణాళికలు ఉన్నాయన్నారు.

## ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో అలాయ్ బలాయ్ కార్యక్రమం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో విజయదశమి దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన "ఆలాయి బలాయి"కార్యక్రమంలో పాల్గొన్న మోటకొండూరు మండల కాంగ్రెసు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్, మాజీ మండల అధ్యక్షులు సిరబోయిన మల్లేష్ యాదవ్,మాజీ వార్డు మెంబర్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షులు జల్తార్ రాజు విజయదశమి దసరా పండుగ శుభకాంక్షలు తెలిపారు.



## శిథిలావస్థకు చేరుకున్న వంతెన



**విశ్వంభర, ఫరూఖ్ నగర్:** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో ఉన్న వంతెన పై నిత్యం రద్దీగా ఉండే ఈ వంతెనపై వాహనాలు వెళ్లడంతో పాటు షాద్ నగర్ నుండి హేమాజీపూర్ గ్రామం వరకు ఆర్టీసీ బస్సులు నిత్యం తిరుగుతుంటాయి. అలాగే ప్రైవేట్ స్కూల్లో బస్సులు ద్విచక్ర వాహనాల పెద్ద పెద్ద వాహనాల వరకు అధిక సంఖ్యలో ఈ వంతెన పై రాకపోకలు కోనసాగిస్తుంటాయి. ఇటీవల ఏడ తెరిపి లేకుండా కురిసిన వర్షాలకు బ్రిడ్జ్ సగం కూలిపోయి ఒక వైపు ఒరిగి ఉంది. ఇది ఏ క్షణంలో కూలి పోతుందో అని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య పై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఈ వంతెన వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెన ఇప్పటికే సగం విరిగినప్పటికీ పునర్నిర్మాణం నిర్మించే చర్యలు మాత్రం లేవని ఈ ప్రధాన రహదారిలో వాహనాలు రాకపోకలకు ప్రమాద స్థితి నెలకొనే ప్రమాదం ఉందని ఆయా గ్రామల ప్రజలు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది కనుక కూలిపోతే ప్రాణ నష్టం జరిగే పరిస్థితి నెలకొని ఉంది. కావున ఆయా గ్రామాల ప్రజలకు రోడ్డు మార్గం సరిగ్గ లేక చాలా ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలకు ఈ రోడ్డే ప్రధాన రోడ్డు ఈ రోడ్డు తప్ప వెళ్ళడానికి వేరే మార్గం మాత్రం లేదు. ఈ రోడ్డుపై రాత్రి సమయాల్లో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏళ్ళ నాటి క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకొని రహదారిలో వెళ్లే వాహనాలకు రాకపోకలకు ప్రమాదకరంగా మారిందని ఈ బ్రిడ్జ్ సగం కూలిపోగా మిగిలిన సగ భాగం కూలెందుకు సిద్ధంగా ఉందని అధికారులు ఈ సమస్య పై వెంటనే స్పందించి వంతెన నిర్మాణ తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు వాహన దారులు గ్రామల ప్రజలు కోరుతున్నారు.

## సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఎంపీ, ఎమ్మెల్యే లకు వినతి పత్రం




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో నెలకొల్పాలనుకుంటున్న ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటును వెంటనే ఆపాలని స్థానిక ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం లకు నకిరేకల్ లో రామన్నపేట అఖిలపక్షాల ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు విన్నవిస్తూ, డ్రైపోర్టు పేరుతో భూములు కొనుగోలు చేసి, కాలుష్య కారక అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయడం మూలంగా, ప్రజా ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, పంటలు నష్టపోతాయని, భవిష్యత్ తరాలు ఇబ్బందులు ఎదుర్కొంటాయని, కావున పరిశ్రమ ఏర్పాటు ఆపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నవించారు. స్పందించిన స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజల పక్షాన మా మద్దతు ఎప్పుడు ఉంటుందని, పూర్తి సహకారం ఉంటుందని, ప్రజాభిప్రాయ సేకరణలో అందరూ వ్యతిరేకించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మేక అశోక్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి మల్లారెడ్డి, పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జల్లల పెంటయ్య, కోకన్వీనర్ ఎండి రెహన్, అఖిలపక్ష నాయకులు పూస బాలకృష్ణ, గోదాసు పృథ్వీరాజ్, ఊట్కూరు నరసింహ, బొడ్డుపల్లి వెంకటేశం, ఫజల్ బేగ్, గురజాల అంజిరెడ్డి, మామిడి వెంకట్ రెడ్డి, జమీరుద్దీన్, నాజర్, బావుండ్లపల్లి బాలరాజు, ఎర్ర రమేష్, ఎర్ర శేఖర్, సహదేవ్ పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని కొడంగల్ లో ఆయన నివాసంలో కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన షాదనగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మోహన్ ముదిరాజ్ (విశ్వంభర, కొడంగల్)

# కలుషిత నీరు తాగి ఇద్దరు మృతి

- ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే..
- కేటీఆర్ ఆగ్రహం





విశ్వంభర, సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవరావుపేట గ్రామంలోని బీసీ కాలనీలో కొద్దిరోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. మంచి నీరు రాకపోవడంతో అందుబాటులో ఉన్న నీటినే ఆ కాలనీవాసులు తాగారు. కలుషిత నీరు తాగడం వల్ల ఆ కాలనీలో చాలామంది అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఇద్దరు దుర్మరణం చెందారు. మరో 50 మంది తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో వారిలో ఇద్దర్ని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి.. ఒకరిని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే: కేటీఆర్

కలుషిత తాగునీరు తాగి సంగారెడ్డి జిల్లాలో ఇద్దరు మరణించిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతపై మండిపడ్డారు. తెలంగాణ అంతటా తాగునీరు సరఫరా చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మిషన్ భగీరథ ప్రాజెక్టు పూర్తి చేసిందని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ జలాలను శుద్ధి చేసి రాష్ట్రమంతటా తాగు నీరు ఇచ్చే ఈ ప్రాజెక్టును కూడా రేవంత్ సర్కార్ సరిగ్గా నిర్వహించలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారుసంజీవన్‌రావుపేటలో కలుషిత నీటి సరఫరా వల్ల జరిగిన మరణాలు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, చికిత్స పొందుతున్నవారికి తగిన సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దురదృష్టకరమైన ఘటనలు తెలంగాణలో మరెక్కడ జరగకుండా చూసుకోవాలన్నారు.

## నిరుపేద కుటుంబానికి చేయూత



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలంలోని ఎస్ బి పల్లికి చెందిన పర్తపు కాశయ్య ఇరవై సంవత్సరాల క్రితం చనిపోయాడు. అప్పటి నుండి తల్లి వెంకటమ్మ పిల్లలను చూసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. అయితే నిరుపేద కుటుంబం అయిన ఎస్ బి పల్లికి చెందిన పర్తపు రాజేష్ వివాహానికి మాజీ జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత సత్యనారాయణ దంపతులు వారి కుటుంబానికి అండగా పుస్తె మెట్టలు తల్లి వెంకటమ్మకు అందజేసి కుటుంబాన్ని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ శ్రీలత సత్యనారాయణ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన భర్త రాజేష్ వివాహానికి పుస్తె మెట్టలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. పేదలకు చేతనైన సహాయం చేయడానికి ఎప్పుడు ముందుంటామని మాజీ జెడ్పీటీసీ శ్రీలత సత్యనారాయణ దంపతులు తెలిపారు.

## వాల్మీకి క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్ -4 ప్రారంభం




**విశ్వంభర, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లో వాల్మీకి ప్రీమియర్ సీజన్ 4 ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభం అయిన వాల్మీకి ప్రీమియర్ లీగ్ సీజన్ 4వ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, బీజేపీ మండల అధ్యక్షులు కోమరబండ శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జీబ్ కృష్ణ , బీజేపీ శంకర్ , షాద్ నగర్ బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు బోయ ప్రశాంత్, దయాల శేఖర్, సంట్రింగ్ శ్రీను, శేఖర్, ఆంజనేయులు, బి .వీరేందర్, యాదయ్య, వాసురి, అర్జున్, శ్రీహరి ఇతర అన్ని జట్ల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా X ఎమ్మెల్యే రేవూరి..
# ధర్మారంలో ఫ్లెక్సీ వార్



**విశ్వంభర, ధర్మారం:** మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గీయుల మధ్య ఫ్లెక్సీవార్‌తో ధర్మారంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దసరా పండుగ సందర్భంగా ధర్మారంలో కొండా సురేఖ వర్గీయులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అందులో ఎమ్మెల్యే రేవూరి ఫొటో లేకపోవడంతో ఆగ్రహించిన ఆయన వర్గీయులు ఫ్లెక్సీలను చించివేశారు. ఈ క్రమంలో రేవూరి వర్గీయులపై దాడి చేయడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కొండా వర్గీయులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ కార్యకర్తలను విడుదల చేయాలంటూ కొండా సురేఖ వర్గీయులు ఆందోళనకు దిగారు. రేవూరికి వ్యతిరేకంగా వరంగల్ నర్సంపేట ప్రధాన రహదారిపై నిరసనకు దిగడంతో ధర్మారంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎమ్మెల్యే అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. ధర్నాతో ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. సమాచారం తెలుసుకున్న మంత్రి కొండా సురేఖ గీసుకొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ వర్గీయులపై పెట్టిన కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమ కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ హెచ్చరించారు.

## ఏపీ సీఎం చంద్రబాబుపై
# ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం



**విశ్వంభర, హైదరాబాద్ :** ఏపీ సీఎం చంద్రబాబుపై బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐపీఎస్ పీవీ సునీల్‌కుమార్‌పై క్రమశిక్షణ చర్యల పేరుతో ఏపీ ప్రభుత్వం దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సునీల్‌కుమార్ ట్విట్టర్‌లో పెట్టిన పోస్టులో తప్పేముందని ప్రశ్నించారు. మీ విజ్ఞతకే వదిలేస్తున్నా అని అనడం సర్వీస్ రూల్స్ ఉల్లంఘన ఎట్ల అవుతుందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఒకసారి రాజ్యాంగంలోని ఆర్టికల్ 19ను మళ్లీ చదవాలని.. అప్పుడైనా విషయం అర్థమవుతుందేమోనని విమర్శించారు. ఇలాగే మీ దాడులు కొనసాగితే అఖిల భారత సర్వీసు అధికారులు ఎవరూ కూడా ప్రజలకు సేవ చేయడానికి ఆసక్తిని చూపించరని అన్నారు. అనుభవజ్ఞుడైన అడ్మినిస్ట్రేటర్‌ను అని చెప్పుకుంటూ ఇలా దౌర్జన్యాలను నిరంతరం కొనసాగిస్తున్నందుకు విచారంగా ఉందని ఏపీ సీఎం చంద్రబాబును ఉద్దేశించి విమర్శించారు.గత వైసీపీ ప్రభుత్వం హయాంలో 2021 మే 14తన తనను రాజద్రోహం కేసులో అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారని.. చంపేందుకు యత్నించారని ఇటీవల ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు ఇచ్చిన ఫిర్యాదును ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ కేసులో ఏపీ సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌తో పాటు మరికొందర్ని నిందితులుగా చేర్చి దర్యాప్తును ప్రారంభించింది. దీనిపై ఇటీవల పీవీ సునీల్‌కుమార్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'సుప్రీంకోర్టులో మూడేళ్లు నడిచి, సాక్షాత్తూ సుప్రీంకోర్టు తిరస్కరించిన కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ వేయడాన్ని ఏమనాలో మీ విజ్ఞతకే వదిలేస్తున్నా' అంటూ ఏపీ ప్రభుత్వ నిర్ణయంపై సునీల్‌కుమార్ ట్వీట్ చేశారు. సునీల్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు అఖిల భారత సర్వీస్ ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కిందకు వస్తాయని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని పీవీ సునీల్‌కుమార్‌పై అభియోగాలను నమోదు చేసింది.

## వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి నిమజ్జనం



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం శరన్నవరాత్రుల సందర్భంగా చివరి రోజు రాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులకు అమ్మ వారు దర్శనమిచ్చారు. అధ్యక్షుడు వీరబ్రహ్మ రామ్మోహన్ ఆధ్వ ర్యంలో దేవీ నవరాత్రులు ఆదివారంతో ముగిసాయి. అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు తొమ్మిది రోజులు పాటు నిర్వహించి ఆదివారం పట్టణంలో ఊరేగింపు నిర్వహించి సురసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు పూజా కార్యక్రమాలు పూజారులు సీనయ్య శర్మ, దినేష్ శర్మ నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో బిక్కుమాండ్ల శ్రీనివాస్, అర్ధం లక్ష్మయ్య, కొరివిరమేష్, తేజ, మణికంఠ, సిద్దు, నటరాజ్, యాదయ్య, సామలవెంకటేష్, సుమన్ , పాప్ శెట్టి శ్వేత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాజీవ్ రహదారిపై వాహనాల రద్దీ..

### దుద్దెడలో టోల్ ఫీ లేకుండానే వాహనాలకు అనుమతి!


**విశ్వంభర, సిద్దిపేట :** దసరా సెలవులు ముగియడంతో సొంతూళ్లకు వెళ్లిన వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే అన్ని ప్రధాన రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. వాహనాల రద్దీ కారణంగా టోల్‌గేట్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాజీవ్ రహదారిపై సిద్దిపేట జిల్లా దుద్దెడ టోల్‌గేట్ వద్ద 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. భారీ ట్రాఫిక్ నేపథ్యంలో దుద్దెడ టోల్‌గేట్‌ను ఎత్తివేశారు. ఎలాంటి టోల్ వసూలు చేయకుండానే వాహనాలను అనుమతిస్తున్నారు.వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై గల యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌గేట్ వద్ద సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## మైసిగండి మైసమ్మ దేవాలయంలో దసరా అభిషేకాలు



**విశ్వంభర, కడ్తాల్:** కర్తాల్ మండలం మైసిగండి గ్రామంలోని శ్రీ మైసిగండి మైసమ్మ , శివాలయ, రామాలయ, అన్నపూర్ణాదేవి దేవస్థానంలో అమ్మవారి దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిసాయి. చివరి రోజు అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, యాట నరసింహ, బిచ్చ నాయక్, కలిసి మైసిగండి మైసమ్మకు దసరా సందర్భంగా అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం విద్యుత్ దీపాలంకరణలతో భక్తులకు కనువిందు చేస్తున్నాయి. దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ సిరోలి పంతు నాయక్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజ సేవ కార్యక్రమాలు నిర్వహించారని ఆలయ ఈవో స్నేహలత తెలిపారు. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## నీటిగుంతలో పడి అన్నదమ్ముల మృతి



**విశ్వంభర, మూసాపేట :** నీటి గుంతలో పడి ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం స్ఫూర్తితండాలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్ఫూర్తితండాకు చెందిన సక్రూనాయక్, జ్యోతికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. శనివారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు సక్రూనాయక్, జ్యోతి కుమారులు సాయినాయక్(13), సాకేత్‌నాయక్(9) వెళ్లారు.ఎంతకూ తిరిగి రాకపోవడంతో సక్రూనాయక్ పొలం వద్ద వెతికాడు. కనిపించకపోవడంతో తిరుగు పయన మయ్యాడు. మార్గమధ్యంలో ఉన్న పాంఫండ్ గుంతలో అనుమానం వచ్చి చూడగా కుమారులు ఇద్దరూ మునిగిపోయి కనిపించారు. వారిని కారులో జిల్లా దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

## షకిల్‌కు యాభై వేల ఆర్థిక సహాయం అందజేత



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండ పల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన డ్రైవర్ యూనియన్ సభ్యుడు ఎండి షకిల్ బ్రెయిన్ స్ట్రోక్ రావటం తో గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నిడు. విషయం తెలుసుకున్న వెల్ జాల్ డ్రైవర్ యూనియన్ సభ్యులు షకిల్ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం 50,000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

### విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు




**విశ్వంభర, అమరావతి:** ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న హిందూ మహాసముద్రం మీదుగా ఆవర్తనం ఏర్పడిందని.. దీని ప్రభావంతో సోమవారం దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య భాగాలపై అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఆ తదుపరి 48 గంటల్లో బలపడి పశ్చిమ వాయువ్య దిశగా ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాల వైపు కదిలే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. బుధ, గురు వారాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. సోమవారం బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపారు. వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం ఉందన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాలతో పొంగిపొర్లే వాగులు, కాలువలు, రోడ్లు , కల్వర్టులు, మ్యాన్ హోల్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలు, తీగలు, చెట్లు, హోర్డింగ్స్ కింద ఉండరాదని, పాత భవనాలు వదిలి సురక్షిత భవనాల్లో ఉండాలన్నారు. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశుగొర్రెల కాపరులు చెట్ల క్రింద, పోల్స్, టవర్స్ కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని హెచ్చరించారు.

## మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

**విశ్వంభర, రామన్నపేట:** దసరా పండుగ శుభ సందర్భంగా రామన్నపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నివాసానికి వెళ్లి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రామన్నపేట మండలంలోని ప్రజలందరికీ మంచి జరగాలని, సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు మంచిగా పండాలని, కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, నాయకులు మహేందర్ రెడ్డి, కన్నెబోయిన బలరాం, మెట్టు శ్రీనివాస్ రెడ్డి, ఉయ్యాల బిక్షం, ఆవనగంటి నరసింహ, గొలుసుల సత్తి, కర్రె శ్రీనివాస్, నర విజయ్, కళ్లెం స్వామి, పులిగిల్ల పరమేష్, పావురాల నరసింహ, శేఖర్, నవీన్ తదితరులు పాల్గొనడం జరిగింది.



## గోదావరిలో ఇద్దరు యువకుల గల్లంతు

**విశ్వంభర, కె.గంగవరం:** గోదావరి నదిలో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. ఈ ఘటన అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లిలో చోటు చేసుకుంది. దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని గోదావరి నదిలో నిమజ్జనం చేసేందుకు వెళ్లిన మేడిశెట్టి వీరబ్రహ్మం (35), నరాల వేదమూర్తి (30) ప్రమాదవశాత్తు కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న పామర్రు ఎస్సై జానీ బాషా.. గజఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టారు. గల్లంతైన వ్యక్తులు రావిచెరువు, వెంకటపాలెం గ్రామాలకు చెందిన వారిగా గుర్తించారు.



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి కల్వ సుజాత గుప్తా ని మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన షాబాద్ మండల సహకార సంఘం మాజీ చైర్మన్ ఈదుల నరసింహులు గౌడ్ మరియు షాబాద్ మండల ఆర్యవైశ్య నాయకులు నరాల పూర్ణచంద్రగుప్త, యాచం నవీన్ గుప్తా, రమేష్ గుప్తా. (విశ్వంభర, చేవెళ్ల )

విశ్వంభర
V3 NEWS



## అంతర్జాతీయ టీ20ల్లో తొలి సెంచరీ.. ట్రెండింగ్‌లో శాంసన్

**విశ్వంభర (క్రీడా విభాగం):** దసరా పండుగ రోజు ఉప్పల్ స్టేడియం దద్దరిల్లి పోయింది. క్రికెట్ అభిమానులున ఆనందోత్సాహాల్లో ముంచేస్తూ భారత జట్టు రికార్డు స్కోర్ కొట్టింది. ఇదంతా.. ఒకేఒక్కడితోనే మొదలైంది. అతడే సంజూ శాంసన్ ఇన్నాళ్లు 'అవకాశాలు ఇచ్చినా ఉపయోగించుకోలేదు'.. అనే ముద్ర పడిన సంజూ విశ్వరూపం చూపించాడు. బ్యాటర్లకు స్వర్గధామమైన ఉప్పల్ పిచ్ మీద శివతాండవం చేస్తూ.. బంగ్లాదేశ్ బౌలర్లను ఉతికేస్తూ అంతర్జాతీ టీ20ల్లో మొదటి శతకం.. పొట్టి ఫార్మాట్‌లో రెండో వేగవంతమైన వంద కొట్టేశాడు. సెంచరీ కాగానే తన కండబలం చూపిస్తూ.. నాలుకను ముందుకూ వెనక్కీ ఆడిస్తూ సెలబ్రేట్ చేసుకోవడం ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఎక్స్ వేదికగా అభిమానులు అతడిని పొగిడేస్తూ పోస్టులు పెడుతున్నారు.భారత జట్టులోకి వస్తూ పోతుండే శాంసన్.. భారీ ఇన్నింగ్స్‌తో తన ఉనికిని చాటాడు. వికెట్ కీపర్, బ్యాటర్‌గా రిషభ్ పంత్ స్థానం పదిలం చేసుకుంటున్న వేళ.. 'నేనూ ఖతర్నాక్ ఇన్నింగ్స్‌లు ఆడగలను' అని చాటాడు. తన మెరుపులతో.. శనివారం.. దసరా సంబురాల్లో మునిగిపోయిన అభిమానులను టీవీలకు అతుక్కుపోయేలా చేశాడు.

## ముంబై హెడ్‌కోచ్‌పై వేటు.. జయవర్దనేకు మళ్లీ పగ్గాలు




**విశ్వంభర (క్రీడా విభాగం):** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ ముందు ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. గత సీజన్‌లో హార్దిక్ పాండ్యా సారథ్యంలో ప్లే ఆఫ్స్ కూడా చేరలేకపోవడం పట్ల అసంతృప్తిగా ఉన్న ముంబై యాజమాన్యం హెడ్‌కోచ్‌పై వేటు వేసింది. ప్రధాన కోచ్‌గా సేవలందిస్తున్న మార్క్ బౌచర్ పై వేటు వేస్తూ.. మహేళ జయవర్ధనే కు మళ్లీ పగ్గాలు అప్పగించింది.ముంబైకి 2017 నుంచి 2022 వరకూ హెడ్‌కోచ్‌గా పనిచేసిన ఈ శ్రీలంక దిగ్గజం మరోసారి జట్టును ట్రోఫీ విజేతగా నిలిపే పనిలో నిమగ్నం కానున్నాడు. ఈ విషయాన్ని ఆదివారం ముంబై ఫ్రాంచైజీ ఎక్స్ వేదికగా వెల్లడించింది. మళ్లీ ముంబై ప్రధాన కోచ్ కావడం పట్ల జయవర్దనే స్పందిస్తూ సంతోషం వ్యక్తం చేశాడు.ముంబై ఇండియన్స్‌తో నా ప్రయాణం ఎల్లప్పుడూ చాలా గొప్పది. 2017లో ప్రతిభగల కుర్రాళ్లను వెలికితీసి వాళ్లతో అత్యుత్తమ క్రికెట్ ఆడేలా చేశాం. ఇప్పుడు మళ్లీ హెడ్‌కోచ్‌గా నియమితులయ్యాను. ముంబైని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తాను. అంతేకాదు ముంబై గత చరిత్రను కొనసాగిస్తాం. కొత్త సవాల్‌ను స్వీకరించేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా అని జయవర్దనే తెలిపాడు.

## మద్యం దుకాణంలో చోరీ



**విశ్వంభర, గుర్రంపోడు:** మద్యం దుకాణం గల్లా పెట్టెలోంచి రూ.12 లక్షలు చోరీ చేసిన ఘటన నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి దుకాణం పైకప్పు రేకులు పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. సుమారు రూ.12 లక్షలు నగదు గల్లా పెట్టెలోంచి ఎత్తుకెళ్లాడు. శుక్ర, శనివారం రెండు రోజుల కలెక్షన్ డబ్బు గల్లా పెట్టెలో ఉన్నాయి. దుండగుడు డబ్బు లెక్క పెట్టుకోవడం సీసీ కెమెరా ఫుటేజ్‌లో కనిపించింది. ఆదివారం ఉదయం మద్యం దుకాణం తెరిచి చూడగా చోరీ జరిగినట్లు నిర్వాహకులు గుర్తించారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను బట్టి ఒకే వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న గుర్రంపోడు ఎస్సై నారాయణరెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## కాలువలోకి దూసుకెళ్లిన ఆటో..

### ఒకరు మృతి, పలువురికి గాయాలు

**విశ్వంభర, నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ ట్రాలీ ఆటో కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి సమీపాన ఉన్న సరస్వతి ఆలయం పక్కనగల కేఎల్ఐ కాలువలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మంతటి గ్రామానికి చెందిన ఫాతిమా బేగం అనే మహిళ మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి.మంతటి గ్రామానికి చెందిన ట్రాలీ ఆటో అదే గ్రామానికి చెందిన కూలీలను తీసుకొని పొలానికి వెళుతుండగా ఆలయం సమీపంలో కేఎల్ఐ కాల్వ మలుపు వద్ద అదుపుతప్పి కాలువలో పడింది. దీంతో మహిళ మృతి చెందగా, పది మందికి గాయాలైనట్లు తెలుస్తున్నది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



### హర్మన్‌ప్రీత్ శ్రమంతా వృథా..

# ఉత్కంఠ పోరులో ఓడిన భారత్

**విశ్వంభర (క్రీడా విభాగం):** మహిళల టీ20 వరల్డ్ కప్ సెమీస్ రేసులో కీలక మ్యాచ్‌లో భారత జట్టు పోరాడి ఓడింది. హ్యాట్రిక్ విజయాలతో జోరుమీదున్న ఆస్ట్రేలియాకు బ్రేకులు వేయలేకపోయింది. భారీ ఛేదనలో ఓపెనర్లు షఫాలీ వర్మ(20), స్మృతి మంధాన(6)లు విఫలమైనా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(54 నాటౌట్) ఆఖరి దాకా పోరాడింది. ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ దీప్తి శర్మ(29)తో 63 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును గెలుపు దిశగా నడిపింది. అయితే.. ఆసీస్ బౌలర్లు పుంజుకొని ఆఖర్లో వరుసగా వికెట్లు తీశారు. దాంతో, టీమిండియాకు ఓటమి తప్పలేదు. 9 పరుగుల తేడాతో గెలుపొందిన ఆస్ట్రేలియా సెమీస్ బెర్తుకు మరింత చేరువైంది.



డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా ఛేదనలో భారత జట్టు కీలక వికెట్లు కోల్పోయింది. ఆరంభం అదిరినా ఆసీస్ బౌలర్లు పుంజుకోవడంతో టీమిండియా కష్టాల్లో పడింది. పవర్ ప్లేలో దంచికొడతారనుకుంటే ఓపెనర్లు షఫాలీ వర్మ(20), స్మృతి మంధాన(6)లు స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. దాంతో, మరోసారి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(9), జెమీమా రోడ్రిగ్స్(16)లు ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. కానీ, మేగన్ షట్ వేసిన ఆరో ఓవర్లో జెమీమా భారీ షాట్ ఆడి గార్డ్‌నర్ చేతికి చిక్కింది. దాంతో, 47 పరుగుల వద్ద టీమిండియా మూడో వికెట్ పడింది. ఆ దశలో దీప్తి శర్మ(29), కౌర్‌లు అద్భుతంగా ఆడి నాలుగో వికెట్‌కు 63 పరుగులు భాగస్వామ్యంతో ఆశలు రేపారు. అయితే.. మొలినెక్స్ ఈ జోడీని విడదీసింది. ఆ తర్వాతి ఓవర్లో రీచా ఘోష్()ను ఫొబె లిచ్‌ఫీల్డ్ మెరుపు త్రోతో రనౌట్ చేసింది. అయినా సరే.. హర్మన్‌ప్రీత్ పట్టు వదల్లేదు. 18వ ఓవర్లో రెండు బౌండరీలు.. 19వ ఓవర్లో పూజా వస్త్రాకర్(), ఆమె చెరొక ఫోర్‌తో సమీకరణాలు మార్చేశారు. ఆఖరి ఓవర్లో భారత జట్టు విజయానికి 14 పరుగులు అవసరం కాగా.. అనాబెల్ సథర్‌లాండ్ బంతి అందుకుంది. తొలి బంతికి కౌర్ సింగిల్ తీసింది. అయితే.. రెండో బంతికి పూజా బౌల్డ్ అవ్వగా.. అరుంధతి రెడ్డి రనౌట్‌గా వెనుదిరింగిగింది. ఆ తర్వాత శ్రేయాంక పాటిల్ రనౌట్..

**మెరిసిన హ్యారిస్, పెర్రీ...**

టాస్ గెలిచిన విధ్వంసక బ్యాటింగ్ లైనప్ కలిగిన ఆసీస్‌ను 150 లోపే కట్టడి చేసింది. పవర్ ప్లేలోనే రేణుకా సింగ్(224) విజృంభణతో ఒత్తిడిలో పడిన కంగారూ జట్టు.. వందకొట్టడం కష్టమే అనిపించింది. కానీ.. భారత బౌలర్లలయను దెబ్బతీస్తూ గ్రేస్ హ్యారిస్(40), తహ్లియా మెక్‌గ్రాత్(32)లు బౌండరీలు సాధించారు.హ్యారిస్ జతగా ఎలీసా పెర్రీ(32)లు దూకుడుగా ఆడింది. భారీ షాట్లతో విరుచుకుపడిన ఈ ఇద్దరూ స్కోర్ బోర్డును ఉరికించారు. అయితే.. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని దీప్తి శర్మ(228) డగౌట్ పంపి ఆసీస్ జోరుకు కళ్లెం వేసింది. బౌలింగ్ ఒక్కటే కాదు ఫీల్డింగ్‌లోనూ అదరగొట్టిన టీమిండియా కంగారూలను నిలువరించగలిగింది. ముఖ్యంగా ఆల్‌రౌండర్ రాధా యాదవ్ రెండు సూపర్ క్యాచ్‌లతో మెరిసింది.

# మూకుమ్మడి రాజీనామా చేస్తాం

- మరో 77మంది వైద్యుల హెచ్చరిక
- ఈ నెల 14 వరకు గడువిచ్చిన డాక్టర్లు
- ఇప్పటికే పలు ఆస్పత్రులకు చెందిన 200 మంది రిజైన్



**కోల్‌కతా:** ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కుదిపేస్తోంది. ఈ ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలంటూ జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు అపూర్వ మద్దతు లభిస్తోంది. ఇప్పటికే ఆర్‌జీ కర్ ఆస్పత్రి సహా పలు ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన దాదాపు 200మందికి పైగా సీనియర్ వైద్యులు తమ సంఘీభావం ప్రకటించి మూకుమ్మడిగా రాజీనామాలు చేయగా.. తాజాగా మరో 77మంది వైద్యులు అందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు కల్యాణి జేఎన్ఎం ఆస్పత్రికి చెందిన 77మంది వైద్యులు పశ్చిమ బెంగాల్ ఆరోగ్య వర్సిటీ రిజిస్ట్రార్‌కు పంపిన ఈ మెయిల్‌లో తమ నిర్ణయాన్ని వెల్లడించారు. అక్టోబర్ 14 వరకు గడువు ఇస్తున్నామని.. ఈలోగా డిమాండ్లు పరిష్కరించకపోతే తమ విధులను నిలిపివేస్తామని హెచ్చరించారు.

జూనియర్ వైద్యుల నిరవధిక నిరాహార దీక్షకు సంఘీభావం తెలపడంతో పాటు వారి ఆరోగ్యం క్షీణిస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైద్యులు రిజిస్ట్రార్‌కు పంపిన ఈమెయిల్‌లో పేర్కొన్నారు. పనిచేసే చోట తాము ఎదుర్కొంటున్న మానసిక ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితుల్లో పనిచేయలేకపోవడం వెనుక ఉన్న కారణాలను సైతం ప్రస్తావించారు. జూనియర్ వైద్యుల డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ కనబరచకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం చేయడంతో పాటు ఆరోగ్య కార్యదర్శి ఎన్.ఎస్. నిగంను తక్షణమే తొలగించడం, పనిచేసే చోట భద్రతాచర్యలు తీసుకోవడం వంటి డిమాండ్లను అక్టోబర్ 14లోగా పరిష్కరించాలని.. లేదంటే అధికారికంగా తాము మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ఇదే అంశంపై ఇప్పటికే పలువురు వైద్యులు మూకుమ్మడి రాజీనామాలు పంపగా.. అవి చెల్లవని ప్రభుత్వం ప్రకటించింది. సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా వ్యక్తిగతంగా వైద్యులు రాజీనామా చేయాల్సి ఉంటుందని పేర్కొంది

# ఇజ్రాయెల్‌కు సాయం చేస్తే మాపై దాడి చేసినట్లే

- అలాంటి పరిస్థితే వస్తే తీవ్ర పరిణామాలు
- అమెరికా మిత్ర దేశాలకు ఇరాన్ వార్నింగ్

**టెహరాన్ :** ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఎప్పుడు, ఎలాంటి ఉపద్రవం వచ్చిపడుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఈ తరుణంలో అమెరికా మిత్రదేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా గానీ ఇజ్రాయెల్‌కు సాయం చేస్తే ఇరాన్‌పై దాడికి పాల్పడినట్లేనని, అలాంటి పరిస్థితులే ఎదురైతే టెహ్రాన్ కూడా తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతిస్తున్న నేపథ్యంలో దాని మిత్ర దేశాలకు ఇరాన్ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.

సాయం చేసే ముందు.. ఆ తర్వాత చోటు చేసుకోబోయే పరిణామాలను కూడా తెలుసుకోవాలని హితవు పలికింది. తమ శత్రుదేశానికి సహకరిస్తే.. తమపై దాడి చేసినట్లుగానే భావిస్తామని, అందుకు ప్రతిచర్యగా టెహ్రాన్ కూడా దాడులు ఉద్ధృతం చేస్తుందని ఇరాన్ స్పష్టం చేసింది. హెజ్‌బొల్లాపై విచక్షణ రహితంగా దాడులు చేస్తూ.. ఆ సంస్థకు చెందిన కీలక నేతలను హతమార్చిన ఇజ్రాయెల్‌పై దాడికి దిగినట్లు ఇటీవల ఇరాన్ ప్రకటించింది. ఇన్నాళ్లూ హమాస్, హెజ్‌బొల్లాకు పరోక్షంగా సాయం చేస్తూ వచ్చిన ఇరాన్.. ప్రత్యక్ష యుద్ధంలోకి దిగేసరికి ప్రపంచ వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

మరోవైపు ఇజ్రాయెల్‌కు మద్దతిస్తున్న అగ్రదేశం అమెరికా.. ఇరాన్‌ను కట్టడి చేసేందుకు ఆ దేశంపై ఆంక్షలు విధించింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడికి ప్రతిస్పందనగా, ఇరాన్‌కు నిధులు వచ్చే మార్గాలను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఇరాన్‌కు చెందిన పెట్రోలియం, పెట్రోకెమికల్ రంగాలపై యూఎస్ ఆంక్షలు పెంచినట్లు ట్రెజరీ డిపార్టుమెంట్ తెలిపింది. ఈ క్రమంలోనే 16 సంస్థలను, 17 నౌకలను బ్లాక్ ప్రాపర్టీగా గుర్తించినట్లు వివరించింది. ఇవి నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీకి మద్దతుగా ఇరానియన్ పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తులను రవాణా చేస్తున్నట్లు ఆరోపించింది.

## బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాంగ్రెస్ లో చేరిక



**విశ్వంభర, ఆలేరు :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం సారం గడ్లగూడెం గ్రామ పంచాయతీకి చెందిన బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాల్వల వెంకటేష్ ఆదివారం ఆలేరు ఎంఎల్ఏ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సోదరుడు బీర్ల శంకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీర్ల శంకర్ కాంగ్రెసు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తవిటి నర్సిరెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు సారగండ్ల నరేష్, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి, సారంగండ్ల వెంకటేష్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న డా. మహమ్మద్. హసేనకు అవార్డు ప్రదానం

**విశ్వంభర, నల్లగొండ :** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాలియా తెలుగు శాఖ సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్. మహమ్మద్. హసేనకి 2024 సంవత్సరానికి గాను డాక్టర్. ఏపీజే.అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం ఇస్తున్నట్లుగా సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పి నాగయ్య ప్రకటనలో తెలియజేశారు, తెలుగు సాహిత్యంలో విశేషమైన కృషి చేస్తున్నందుకుగాను, అదేవిధంగా గత రెండు దశాబ్దాలుగా అధ్యాపక వృత్తి లో ఉంటూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానాలలో స్థిరపడే విధంగా తీర్చిదిద్దినందుకుగాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు,ఈ పురస్కారం ఈనెల 20వ తేదీన గుంటూరులో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణ రావు చేతులమీదుగా అందుకుంటారు, ఈ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల కళాశాల ప్రధానాచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రులు అభినందనలు తెలిపారు.

## కరెంటు షాక్‌తో యువకుడు మృతి



**విశ్వంభర, మేడిపల్లి:** మేడిపల్లి మండలం రాగోజి పేట గ్రామంలో దసరా పండుగ పూట గ్రామంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని మైససుర మర్దిని వద కార్యక్రమంలో రావణాసురుని కి నిప్పు పెట్టే ప్రయత్నంలో పక్కనే ఉన్న ట్రాన్స్ఫార్మర్ వైరు తగిలి విద్యుత్ ఘాతానికి అరిసెల వెంకటేష్ గురయ్యాడు. గ్రామస్తులు వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అరిసెల వెంకటేష్ మృతి చెందాడని వైద్యులు వైద్యులు ధృవీకరించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య సరిత(30) కూతురు ఆధ్యా(10) కొడుకు ఆర్యన్(6) ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై శ్యామ్ రాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పల్లె ప్రకృతి వనంలోని చెట్లు నరికివేత

**విశ్వంభర, మేడిపల్లి:** మేడిపల్లి మండలం పసునూరు గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనంలోని ఏపు గా పెరిగిన దాదాపుగా 50 నుండి 60 చెట్లను గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో ఈ చెట్లను నరికి వేయడం విస్మయానికి గురిచేసింది. తెలంగాణ ప్రభుత్వం లక్షలు వెచ్చించి చెట్లను విరివిగా పెంచాలని కాలుష్యాన్ని నివారించాలని కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తే పసునూరి గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ చెట్లను నరకడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఎందుకు చెట్లను నరికి వేశారని అడగగా వారి దగ్గర నుండి సమాధానాలు రాలేదని గ్రామస్తులు అంటున్నారు. ప్రభుత్వం కూలీలకు డబ్బులు ఇచ్చి మరి చెట్లను పెంచుతుంటే ప్రభుత్వ అధికారులే దగ్గరుండి చెట్లను నరికేయడం చాలా బాధాకరమని గ్రామస్తులు వాపోతున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.






## ట్రాఫిక్ అసిస్టెంట్ కమీషనర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శన

**విశ్వంభర, హైదరాబాద్ :** ట్రాఫిక్ అసిస్టెంట్ కమీషనర్ శంకర్ రాజు ఆదివారం బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను నార్త్ జోన్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమీషనర్ జి. శంకర్ రాజు సందర్శించారు. తన పర్యటనలో సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి విధులు నిర్వర్తించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రశంసనీయమైన చొరవతో బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లోని సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి. ఆనంద్ సైకిల్‌పై పని వద్దకు వచ్చి తన విధులను నిర్వర్తించారు. పర్యావరణ అనుకూల రవాణా యొక్క ఈ చర్య మిగిలిన సిబ్బందికి స్ఫూర్తినిచ్చింది. ఈ ప్రయత్నాన్ని అభినందిస్తూ, సుస్థిరమైన మరియు ఆరోగ్య స్పృహతో కూడిన జీవనానికి ఉదాహరణగా నిలిచినందుకు సబ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌ను శ్రీ జి. శంకర్ రాజు వ్యక్తిగతంగా అభినందించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ మిగతా వారు కూడా అనుసరించాలని, ఇలాంటి పద్ధతులను అవలంబించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత ఆరోగ్యానికి సహకరించాలని శ్రీ జి. శంకర్ రాజు సిబ్బందిని సూచించారు. నార్త్ జోన్ ట్రాఫిక్ పోలీసులు సేవ మరియు పర్యావరణ బాధ్యత రెండింటిలోనూ రోల్ మోడల్‌గా ఉండటానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు.

## భార్య భర్తల మధ్య గొడవలతో భార్య ను హత్య చేసిన భర్త

**విశ్వంభర, ఎల్బీనగర్ :** గత కొంతకాలంగా భార్యా భర్తల మధ్య గొడవల కారణంగా భార్యని భర్త హత్య చేసిన సంఘటన సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా కు చెందిన గుంజి సోను (32), గుంజి వెంకటేష్ కూలీ పనుల నిమిత్తం జీవనం సాగిస్తూ సరూర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధి సరస్వతి నగర్ లో నివాసం ఉంటున్నాడు. భర్త మేస్త్రీ గా, భార్య ఇండ్లలో పని మనిషిగా జీవనం సాగిస్తూఉన్నారు. భార్య భర్తల మధ్య గత మూడు సంవత్సరాల నుండి తరచు గొడవలు చోటుచేసుకుంటున్నాయి. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో వివాదాల పరిష్కారం కోసం ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయ్. రోజు వారి క్రమంలో భార్య ను భర్త వెంకటేష్ బైక్ పై ఇంటికి తీసుకరావడం జరిగింది. ఇంట్లో ఇద్దరి మధ్య మళ్ళీ గొడవలు చోటుచేసుకోవడం, భార్య పంజాబీ డ్రెస్ విషయంలో గొడవలు పెట్టుకుని, ఆవేశంతో భార్యను భర్త హత్య చేశాడు.

భర్త వెంకటేష్ కు కుడా గాయాలు కావడంతో స్థానికులు వైద్య చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న స్థానికులు సరూర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, హత్య కు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## తుల్జా భవాని గుడికి లక్పతి నాయక్ విరాళం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం గనుగుమరల తండా గ్రామపంచాయతీలో నూతనంగా తుల్జా భవాని (మాత) గుడి నిర్మాణం చేపట్టారు. గుడికి సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జర్పుల లక్పతి నాయక్ తన వంతుగా 5 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గుడి కమిటీల సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి లక్పతి నాయక్ కు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బిఖ్యా నాయక్, మాజీ డిప్యూటీ సర్పంచ్ శారద పాండు నాయక్, రూప్ సింగ్ నాయక్, రాజు నాయక్, శ్రీను నాయక్, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## దసరా ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**విశ్వంభర, హన్మకొండ:** హన్మకొండ జిల్లా మడికొండ రంగలీల మైదానం లో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ రావణాసుర వధ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి షీల్డ్ ప్రధానం చేశారు. రావణవధ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శాల్వాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ దసరా మీ జీవితంలో ఆనందాన్ని, విజయాన్ని అందించాలని, పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వార్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతం విజయదశమి అని తెలిపారు. అందరిపై దుర్గామాత ఆశీస్సులు ఉండాలని మన ప్రజా ప్రభుత్వంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలియజేస్తూ అందరికి దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా డివిజన్ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెప్పోత్సవంలో పాల్గొన్న ఎంపీ రవిచంద్ర



**విశ్వంభర, వరంగల్:** ఓరుగల్లు భద్రకాళి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా దసరా పండుగ నాడు హంస వాహన తాటకం మీద నిర్వహించే జలక్రీడ తెప్పోత్సవం కార్యక్రమం అంగరంగ వైభోగంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శాశ్వత దాతగా ప్రతి సంవత్సరం వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సభ్యులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తూ వస్తున్నారు. అదేవిధంగా ఈరోజు జరిగిన తెప్పోత్సవ పూజా కార్యక్రమంలో భద్రకాళి భద్రేశ్వర్ల దేవతమూర్తుల విగ్రహాలను హంస వాహనాన్ని వివిధ రకాల పుష్పములచే సర్వాంగ సుందరంగా అలంకరించి విద్యుత్ కాంతి వెలుగుల మధ్య వేద పండితులు ఘనంగా నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సమేతంగా నిజరూప అవతారంలో దర్శనమిస్తున్న భద్రకాళీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శేషు భారతి, దేవాలయం ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, అర్చకులు నాగరాజ్ శర్మ, అరవింద్ శర్మ, గణేష్ శర్మ, దత్తు శర్మ వేద ఆశీర్వచనాలతో అమ్మవారి శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వద్దిరాజు సోదరులు వద్దిరాజు కిషన్ శశిరేఖ కుటుంబ సభ్యులు, వద్దిరాజు వెంకటేశ్వర్లు ఉమామహేశ్వరి, డా.జంగిలి వెంకట్ సునీత, వద్దిరాజు శ్రీనివాస్ శిల్ప, తౌడ్ శెట్టి నరసింహారావు పద్మజ దంపతులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జమ్మి పూజ చేసిన మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో దసరా పండుగ సందర్భంగా శనివారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ తన వ్యవసాయ క్షేత్రంలో జమ్మి పూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖఃసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని జమ్మి పూజ సందర్భంగా దుర్గామాతను ప్రార్థించినట్లు తెలిపారు.

## ప్రయాణికులు ఆదమరిస్తే అనంత లోకాలకే..

**విశ్వంభర , ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రం నుండి వలిగొండకు వెళ్లే రోడ్డు తారు తేలిపోయి గుంతల మయమై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డును బాగు చేయించపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డును బాగు చేయించాలని ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తున్న ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రోడ్డు ఆలేరు భువనగిరి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ ఉంది. ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిధిలోకి ఈ రోడ్డు వస్తుంది. ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోడ్డును బాగు చేయించాలని ఈ రోడ్డున ప్రయాణిస్తున్న గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి, అధికారులకు పత్రికాముఖంగా ఆత్మకూరు(ఎం)మండలంలోని తిమ్మాపురం గ్రామస్తులు, వలిగొండ మండలంలోని మునగాల తుర్కపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రోడ్డు గుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు పడి గాయాలైన వారు చాలామంది ఉన్నారు. అలాగే తిమ్మాపురం మిషన్ భగీరథ ట్యాంక్ సమీపంలో బునాదిగాని కాలువపై నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా ఏర్పడిన గుంతల వలన రాత్రిపూట ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు పడి గాయాలయ్యాయని తిమ్మాపురం గ్రామ ప్రజలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రోడ్లు బాగుచేయలేదు, కనీసం ఈ కాంగ్రెసు ప్రభుత్వములోనైనా రోడ్లు బాగు చేసి ప్రయాణికులకు ప్రాణాలు కోల్పోకుండా కాపాడి ప్రాణాలను కాపాడినవారు అవుతారని ప్రజాప్రతినిధులను అధికారులను ప్రజలు ప్రయాణికులు కోరుకుంటున్నారు.



# ఘనంగా దసరా ఉత్సవాలు

**విశ్వంభర, ఆమనగల్లు/ పటాన్ చేరు/ యాకుత్పురా/ ఆత్మకూరు(ఎం):** విజయానికి సంకేతంగా విజయదశమి పర్వదినాన్ని జరుపుకుంటామని మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. శనివారం దసరా వేడుకలను పురస్కరించుకొని అమనగల్లు మండలం కేంద్రం లో జరిగిన దసరా ఉత్సవాల్లో ఆయన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా హనుమాన్ దేవాలయం నుండి ఊరేగింపుగా వెళ్లి స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించిన అనంతరం రావణాసుర బొమ్మను మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ దుర్గయ్య తో కలిసి దహనం చేశారు అందరితో అలయ్ బలాయ్ చేసుకొని దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులు దుర్గామాతను భక్తిశ్రద్ధలతో మండపాలను ఏర్పాటు చేసి పూజించిన ఉత్సవ కమిటీలకు శుభాకాంక్షలు తెలియజేశారు. విజయానికి సంకేతంగా దసరా పండుగ జరుపుకుంటారన్నారని ఆ జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దసరా పండుగ రోజు నిర్వహించే అలాయి బలాయి ద్వారా పేద ధనిక తారతమ్యం లేకుండా అందరి మధ్య స్నేహపూర్వక వాతావరణం అలవడుతుందన్నారు. దసరా ఉత్సవాలను ప్రజలంతా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రమోద్ కుమార్, ఎస్సై వెంకటేష్, వరప్రసాద్, సంఘ సేవకులు పాపిశెట్టి రాము, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, పాల్గొన్నారు.

**చిట్కుల్లో...**

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పర్వదినాన్ని జరుపుకుంటామని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం దసరా వేడుకలను పురస్కరించుకొని స్వగ్రామం పటాన్ చేరు మండలంలోని చిట్కుల్ లో జరిగిన దసరా ఉత్సవాల్లో ఆయన గ్రామస్థులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా వేణుగోపాల స్వామి మందిరం నుంచి శావా తీసుకొని వెళ్లి జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందరితో అలయ్ బలాయ్ నిర్వహించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులు దుర్గామాతను భక్తిశ్రద్ధలతో పూజించి 10వ రోజు విజయానికి సంకేతంగా దసరా పండుగ జరుపుకుంటారన్నారని ఆ జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దసరా పండుగ రోజు తీసుకునే అలాయి బలాయి ద్వారా పేద ధనిక తారతమ్యం లేకుండా అందరి మధ్య స్నేహపూర్వక వాతావరణం అలవడుతుందన్నారు. దసరా ఉత్సవాలను ప్రజలంతా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

**వాసవి కన్యకా పరమేశ్వరి భవనంలో..**

యాకుత్పురా డివిజన్ లాల్ దర్వాజా గౌలిపుర లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి 33వ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీ బుగ్గారపు దయానంద్ గుప్తా ఎమ్మెల్సీ పాల్గొన్నారు. గౌలిపుర సాయిబాబా దేవాలయం నుండి భక్తులందరూ కలిసి అమ్మవారి విగ్రహం ఊరేగింపుగా వెళ్ళి ట్రస్ట్ భవనంలో ఉత్సవాలు జరిపినట్టు తెలిపారు. ప్రతిరోజు తీర్థ ప్రసాదం అందించినట్టు తెలిపారు. చైర్మన్ చిలరాముల గుప్తా, వైస్ చైర్మన్ గుగ్గిల అశోక్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా, భువనగిరి భాస్కర్ గుప్తా, మామిశెట్టి యాదయ్య గుప్తా, నరాబు సంతోష్ కుమార్ గుప్తా, గుగ్గిల సంతోష్ కుమార్, బలుస రవి, ఇతర కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**తిమ్మాపురంలో...**


యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని గ్రామాల్లో ప్రజలు దసరా పండుగ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తిమ్మాపురం గ్రామంలో నడిబొడ్డున ఉన్న హనుమాన్ దేవాలయం నుంచి గ్రామస్తులు ఆటపాటలతో ఊరేగింపుగా తుర్కపల్లి సాకరబావి వద్ద ఉన్న జమ్మి చెట్టు దగ్గరకు భారీగా బయలుదేరి జమ్మి చెట్టుకు పూజలు చేసి జమ్మి పత్రి తీసుకున్నారు. అనంతరం హనుమాన్ దేవాలయం వద్దకు చేరుకుని శ్రీ రామ భక్త హనుమానును పూజించి ఆలయం ఆవరణలో భక్తి శ్రద్ధలతో భజనలు, పాటలతో ఆటలు ఆడారు. అనంతరం ప్రసాదం వితరణ నిర్వహించిన తర్వాత జమ్మి ఆకులను ఒక్కరికీ ఒక్కరూ పెట్టుకుని అలాయ్ బలాయ్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, యుత్, గ్రామస్తులు, భవాని భక్తులు, దసరా పండుగ నిర్వహకులు పాల్గొన్నారు















## మధుసూదనాచారికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఐఏఎస్



**విశ్వంభర, హైదరాబాద్:** శాసనమండలి ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి ఎన్నిక కావడం బీసీలకు శుభపరిణామం అని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కన్వీనర్ మాజీ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు అన్నారు. ఆదివారం తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత కార్యాలయంలో, మాజీ స్పీకర్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ప్రతిపక్ష నేతగా పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ఆయనను కలిసి బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ మాజీ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గోర శ్యాంసుందర్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారోజు రామన్న చారి తదితరులు కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఉద్యమం ఉద్యృతంగా నడుస్తున్న తరుణంలో ఒక బీసీ నేత శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఎన్నిక కావడం బీసీలకు శుభపరిణామమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలు అన్ని రకాలుగా అణచివేతకు గురవుతున్నారని , ఈ అంశాలపై బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మధుసూదనాచారి మండలిలో తన గళం విప్పాలని ఈ సందర్భంగా సూచించారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలయ్యేల చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన సూచించారు.

## స్థానిక ఎన్నికల్లో బీజేపీ గ్రామ ఎన్నికల మేనిఫెస్టో

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పారుపల్లి గ్రామం ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే గ్రామంలోని ఈ క్రింద పేర్కొన్న సమస్యలు పరిష్కరిస్తామని ప్రజలకు పారుపల్లి గ్రామ భారతీయ జనతా పార్టీ గ్రామ శాఖ మేనిఫెస్టో తెలియజేసంది. ఉచిత తాగునీరు అందిస్తాం, మన గ్రామంలో సంపూర్ణ మద్యపానం నిషేధిస్తాం, అత్యవసర సమయంలో ఆపదలో ఆదుకోవడం కోసం అంబులెన్స్ ఏర్పాటు చేస్తాం, ప్రతి ఆడపిల్ల పెళ్ళికి కానుక అందజేస్తాం, మన గ్రామంలో గతంలో ఏడవ తరగతి వరకు ఉన్న పాఠశాలను ప్రైవేట్ స్కూళ్ల దీటుగా ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేస్తాం, స్వర్గపురి రథం, ఫ్రిజేర్ బాక్స్, అంత్యక్రియలు ఖర్చుకు 5000 రూపాయలు అందజేస్తాం.

బొడ్రాయి పండుగ గ్రామ దేవతల పండుగ దేవాలయాల నిర్మాణం చేస్తాం. ప్రతి పౌరుడికి 18 సంవత్సరాల నుండి 55 సంవత్సరాల లోపు వారికి రెండు లక్షల బీమా సౌకర్యం కల్పిస్తాం, కేంద్ర ప్రభుత్వం నుండి అత్యధిక నిధులుతెచ్చి రోడ్లు డ్రైనేజ్ వీధి దీపాలు ప్రతి గల్లీకి ఏర్పాటు చేస్తాం, గ్రామంలో పశు వైద్యశాలలో ప్రతిరోజు డాక్టర్ ఉండేలాగా మందులు అందుబాటులో ఉంచే విధంగా కృషి చేస్తామని పది హామీలను పారుపల్లి గ్రామ భారతీయ జనతా పార్టీ గ్రామ శాఖ తన మేనిఫెస్టోను పత్రికలకు విడుదల చేశారు.



మధు యాష్కీ గౌడ్ ని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దాము మహేందర్ యాదవ్

(విశ్వంభర, హైదరాబాద్)

## దుర్గామాత ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలి



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయి. తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో దుర్గామాత పూజలు నిర్వహించగా, చివరి రోజు దుర్గామాత విగ్రహ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం ప్రత్యేకంగా ఆకర్షించింది. ఈ సందర్భంగా దుర్గామాత ముక్కుపుడక, పట్టుచీర, కలశం వంటి ప్రతిష్ఠాత్మక వస్తువులకు వేలంపాట నిర్వహించారు. దుర్గామాత ముక్కుపుడకను గడిగే వెంకటయ్య రూ. 1,70,000 వేలం ద్వారా దక్కించుకున్నారు. పట్టుచీరను అన్ని సుధాకర్ గౌడ్ రూ. 51,000 లకు పొందారు. ప్రత్యేక కలశంను కావాలి జంగయ్య వేలం ద్వారా దక్కించుకున్నారు. వేలంపాటలో విజేతలైన వారికి ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ ఉత్సవాలలో పాల్గొన్న గ్రామస్థులు దుర్గామాత కృప వలన సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభం

**విశ్వంభర, అశ్వారావుపేట:** అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ సమీపంలో నూతనంగా నిర్మించిన 2.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విద్యుత్ ఆర్థిక ప్రణాళిక శాఖల మంత్రి మల్లు బట్టి విక్రమార్క, వ్యవసాయ కో ఆపరేటివ్ టెక్ టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవిన్యూ హౌసింగ్ పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభంచేశారు. అంతకు ముందు తెలుగు రాష్టాల పామాయిల్ సాగు రైతులకు నిర్వహించిన అవగాహనా సదస్సులో రాజకీయ ప్రముఖులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం అవలంభిస్తున్న విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వ్యవసాయ సంబంధిత అధికారులు, శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగులో అధిక దిగుబడుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంతర పంటల సాగు వ్యవసాయంలో వినూత్న పంటలపై అవగాహన, ఆయిల్ ఫామ్ మద్దతు ధర కోసం చేయవలసిన కృషి , నూతనంగా సాగుచేసే రైతులకు ప్రభుత్వ రాయితీలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు.



# బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు: చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి:** నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా సాధ్యమైనంత వరకు ప్రజలపై నిత్యావసరాల భారం పడ కుండా చూడాలన్నారు. డిమాండ్-సప్లై మధ్య వ్యత్యాసానికి గల కారణాలను విశ్లేషించి తగు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నిత్యావసర వస్తువుల ధరల భారం ప్రజలపై పడకుండా పౌరసర ఫరాల శాఖ తీసుకుంటున్న చర్యలపై ఉండవల్లిలోని నివాసం నుంచి సీఎం దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ధరలు పెరిగిన తరువాత తగ్గించే ప్రయత్నం చేయడం.. రాయితీ లు ఇవ్వడం కంటే.. మూడు శాఖలు నిరంతర పర్యవేక్షణ ద్వారా ధరల పెరుగుదలను ముందుగానే గ్రహించి చర్యలు తీసుకోవా లన్నారు. ఈ విషయంలో పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కె టింగ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు వస్తా యని సూచించారు. నిత్యావసర వస్తువుల ధరల భారం తగ్గించేం దుకు ఇప్పటివరకు తీసుకున్నచర్యలను అధికారులు సీఎంకు వివ రించారు. ధరలనియంత్రణ, తాత్కాలికంగా,దీర్ఘకాలికంగా చేపట్టా ల్సిన చర్యలపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు.
ప్రస్తుతం రైతు బజార్లలో కౌంటర్ల ద్వారా చేపట్టిన అమ్మకాలపై సీఎం సమీక్షించారు. రైతు బజార్లలో పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్, కందిపప్పు, టమాటా, ఉల్లిపాయల విక్రయాలపై వివ రాలు అడిగి తెలుసుకున్నారు. విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ క్రియాశీ లకంగా పనిచేయాలని, వ్యాపారులు కూడా సహకరించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద ఎత్తున గిడ్డంగులను అందుబాటులోకి తేవడం ద్వారా రైతులకు, వినియోగదారులకు న్యాయం చేయవచ్చని సీఎం అన్నారు. ధరల



నియంత్రణ విషయంలో ఊరట కల్పించేలా ప్రభుత్వం చర్యలు ఉంటేనే ప్రజలు హర్షిస్తారని.. ఆ స్థాయిలో అధికారులు ప్రణాళికలు అమలు చేయాలని చంద్రబాబు సూచించారు.

## ఘనంగా ప్రారంభమైన విజయనగరం ఉత్సవాలు





**విశ్వంభర, విజయనగరం :** విజయనగరం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా తొలుత పట్టణంలోని పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి భారీ ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించగా.. పెద్ద ఎత్తున యువత, క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు. అనంతరం అయోధ్య మైదానంలో ప్రారంభోత్సవ సభ నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభ సూచికగా అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గాల్లో కి బెలూన్లు విడిచిపెట్టారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విజయనగర వైభవ శతకం' పుస్తకాన్ని స్పీకర్, నేతలు ఆవిష్కరించారు.

## వరద విపత్తును ఎదుర్కోవడంలో స్టార్టప్ సంస్థలది కీలక పాత్ర: మంత్రి లోకేశ్



**విశ్వంభర,అమరావతి:** అంకురాలతో సాంకే తికతను ఏకీకృతం చేసి వరద బాధితులకు సహాయం చేసినట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆంధ్ర నినాదమే కాదు.. పరి పాలన విధానాన్ని మార్చే ప్రక్రియ అని తెలిపారు. "ఇటీవల వచ్చిన వరద విపత్తును ఎదుర్కోవడంలో అంకుర సంస్థలు ఎంతో ఉపయోగపడ్డాయి. ఇదో నూతన అధ్యాయ నం. ఆయా సంస్థల సహాయంతో త్వరిత గతిన బాధితుల గణన, పరిహారం బదిలీకి వీలు కలిగింది" లోకేశ్ పేర్కొన్నారు.

## ఏపీ పన్నుల చీఫ్ కమిషనర్‌గా ఎ.బాబు



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్‌గా బాబు.ఎ నియ మితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ అదనపు బాధ్యతల నుంచి ఎంకే మీనాను రిలీవ్ చేస్తూ ఆదేశాలిచ్చింది.

## మద్యం ధరలపై ఏపీలో చట్ట సవరణ.. విదేశీ బాటిళ్ల ఎమ్మార్పీపై అదనపు ప్రివిలేజ్ ఫీజు



**విశ్వంభర, అమరావతి:** భారత్‌లో తయా రయ్యే విదేశీ మద్యం బాటిళ్ల ఎమ్మార్పీ ధరకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టసవరణ చేసింది. ఈమేరకు అదనపు ప్రివిలేజ్ ఫీజు విధిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అదనపు ప్రివిలేజ్ ఫీజు కింద చిల్లర కాకుండా తదుపరి పది రూపాయ లకు పెంచుతూ సవరణ చేశారు. దీంతో ఎమ్మార్పీ ధర రూ.150.50గా ఉంటే రూ.160కి పెంచేలా అదనపు ప్రివిలేజ్ ఫీజు ఉండనుంది. రాష్ట్ర గవర్నర్ ఆమోదం మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా గెజిట్ నోటిఫికేషన్ విడు దల చేశారు.

## బన్నీ ఉత్సవం కర్రల సమరంలో 100 మందికిపైగా గాయాలు




**విశ్వంభర, హొలహర్వి:** ఏటాదసరా సందర్భంగా దేవరగట్టులో బన్నీ ఉత్సవాలు నిర్వహిస్తారన్న సం గతి తెలిసిందే. ఇందులో భాగంగా పలు గ్రామాల ప్రజలు మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులను దక్కించుకునేందుకు కర్రలతో తలపడతారు. సంప్రదాయం ప్రకారం ఈ ఏడాది కూడా బన్నీ ఉత్సవాన్ని నిర్వహించారు. అయితే, ఆదివారం తెల్లవారుజామున జరిగిన కర్రల సమరంలో హింస చెలరేగింది. కర్రలతో ఇరువర్గాల ప్రజలు కొట్టుకోవడంతో 100మందికి పైగా గాయాలపాల య్యారు. వారిలో 20 మందికి తీవ్రగాయాలు కావడంతో ఆదోని, బళ్లారి ఆస్పత్రులకు తరలించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు సమీప ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో సుమారు 800 అడుగుల ఎత్తైన కొండపై వెలసిన మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్నీ ఉత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. స్వామి దేవతా మూర్తులను కాపాడుకోడానికి నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల భక్తులు ఒకవైపున.. అరికెర, అరికెరతండా, సుళువాయి, ఎల్లార్తి, కురుకుంద, బిలేహాల్, విరుపాపురం తదితర గ్రామాల భక్తులు మరోవైపున కర్రలతో తలపడ తారు. ఈ నేపథ్యంలో కొందరు గాయపడుతుంటారు. వారిని స్థానిక వైద్య శిబిరంలో చేరుస్తారు. విషమంగా ఉంటే పట్టణానికి తరలిస్తారు. కొద్దిపాటి గాయాలైతే పసుపు రాసుకుని వెళ్లిపోతారు.

### బన్నీ ఉత్సవాల కోసం వచ్చి.. మృత్యుఒడికి

కర్నూలు జిల్లా ఆలూరు మండలం కరిడి గుడ్డం వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరు యువకులు మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు కర్ణాటకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. దేవరగట్టులో దసరా బన్నీ ఉత్సవాలు చూసేందుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

## పండగల పవిత్రతను కాపాడుకోవడం మనందరి బాధ్యత: సీఎం చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** ఇంద్రకీలాద్రిపై దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సంస్కృతి, సంప్రదాయాల్లో పండగలు అంతర్భాగంగా ఉంటాయని.. వాటి పవిత్రత కాపాడుకోవడం మనందరి బాధ్యత అని సూచించారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల విజయవంతంపై చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసిన తితిదేకు అభినందనలు తెలిపారు. "తిరుమలలో ఏటా 450 ఉత్సవాలు జరుగుతాయి. అన్నింటికంటే బ్రహ్మోత్సవాలు ముఖ్యమైనవి. స్వామివారిని 6 లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. వాహన సేవలకు 15 లక్షల మంది భక్తులు హాజరయ్యారు. గతంలో 16 లక్షల మందికి అన్నప్రసాదాలు అందించారు. ఈ ఏడాది 26 లక్షల మంది భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు. పండగ విశిష్టత, వైభవం ఉట్టిపడేలా అద్భుత ఏర్పాట్లు చేశారు. లైట్లతో పాటు ప్రత్యేక డిజిటల్ వ్యవస్థ ఏర్పాటు చేశారు" అని చంద్రబాబు తెలిపారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసు సీఐడీకి అప్పగింత

**విశ్వంభర, అమరావతి:** వైకాపా హయాంలో టీడీపీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు నివాసంపై దాడి కేసులను ఏపీ ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ప్రస్తుతం మంగళగిరి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ కేసుల విచారణ జరుగుతోంది. తాజాగా వీటిని సీఐడీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విచారణ ఫైళ్లను సోమవారం సీఐడీకి మంగళగిరి డీఎస్పీ అందజేయను న్నారు. వైసీపీ అధికారంలో ఉండగా 2021 అక్టోబర్ 19న ఆ పార్టీకి చెందిన మూకలు టీడీపీ కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. వైకాపా నేతలు దేవినేని అవినాష్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి అనుచరులు దాడి చేశారు. చంద్రబాబు నివాసంపై మాజీ మంత్రి జోగి రమేశ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్ తదితరులు తమ అనుచరులతో దాడికి వెళ్లారు. నిందితుల్లో నందిగం సురేశ్ సహా పలువురిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో విచారణ వేగవంతానికి కేసులను ప్రభుత్వం సీఐడీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది.

## ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత



**విశ్వంభర, హైదరాబాద్:** ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా కన్నుమూశారు. కొంతకా లంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వారం క్రితం నిమ్స్‌లో చేరారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడి చారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నా యనే ఆరోపణలతో 2014లో సాయిబాబాను పోలీసులు అరెస్టు చేశారు. 2017లో ఆయనకు గడ్చిరోలి సెషన్స్ కోర్టు జీవితఖైదు విధించింది. దీంతో దాదాపు తొమ్మిదేళ్లపాటు జైల్లోనే గడ పాల్సి వచ్చింది. ఈ ఏడాది మార్చి 5న బాంబే హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించ డంతో నాగ్‌పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. మానవహక్కుల ఉద్యమకారుడు, రచయిత, విద్యావేత్తగా సాయిబాబా గుర్తింపు పొందారు.

## తేనెటీగల దాడిలో చిన్నారి మృతి

**విశ్వంభర, ముంచంగిపుట్టు:** తేనెటీగల దాడిలో చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం ఎగకంట వరంలో చోటు చేసుకుంది. చెట్ల వద్ద ఆడుకుం టున్న అన్నాచెల్లెలిపై తేనెటీగలు దాడి చేశాయి. గాయాలపాలైన వారిని దగ్గర్లోని ఆస్పత్రికి తర లించగా.. చెల్లెలువంతల గౌరి (4) చికిత్స పొం దుతూ ప్రాణాలు కోల్పోయింది. ఆమె సోదరుడు విశ్వ (10)కు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

## రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

**విశ్వంభర, అమరావతి:** వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 17 నుంచి అన్ని జిల్లాల్లో అధికారికంగా నిర్వహించాలని పేర్కొంది. అనంతపురంలో రాష్ట్ర స్థాయి వాల్మీకి జయంతి వేడుకను జరపనున్నారు.

## విజయవాడలో లోకోపైలట్ హత్య.. బిహార్ వ్యక్తే నిందితుడు

**విశ్వంభర, విజయవాడ:** దక్షిణ మధ్య రైల్వేలో లోకో పైలట్ డి.ఎబినేజర్ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు బిహార్‌కు చెందిన దేవ్ కుమార్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దక్షిణ మధ్య రైల్వేలో లోకో పైలట్ డి. ఎబినేజర్‌ను విధుల్లో ఉండగా ఇనుప రాడ్డుతో ఆయన తలపై బలంగా కొట్టారు. తలకు బలమైన గాయం కావడంతో విజయవాడ ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఐదు బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించారు.
"శనివారం ఉదయం 7 గంటల సమయంలో అప్పి యార్డు సమీపంలో గాలింపు చేపడతుండగా నిందితుడు సీఐకి కనిపించాడు. అదుపులోకి తీసుకొని విచారించగా తన పేరు దేవ్ కుమార్ అని, బిహార్‌లోని షైనీ దర్బారీ గ్రామానికి చెందిన వ్యక్తిగా చెప్పాడు. నిందితుడు జీవనాధారం కోసం విజయవాడ వచ్చి.. వ్యసనాలకు బానిస అయ్యాడు. రోజూ సంపాదించే డబ్బులు సరిపోకపోవడంతో రాత్రిపూట ఒంటరిగా కనిపించిన వారిని బెదిరించి డబ్బులు వసూలు చేయడం మొదలుపెట్టాడు. ఎవరైనా ఎదురుతిరిగితే వారిపై దాడిచేసేందుకు కూడా వెనకాడేవాడు కాదు.
ఈ క్రమంలోనే ఈ నెల 10న విజయవాడ రైల్వే స్టేషన్ ఎఫ్ క్యాబిన్ వద్ద లోకో పైలట్ ఎబినేజర్ కనిపించగా డబ్బులు డిమాండ్ చేశాడు. తన వద్ద డబ్బుల్లేవు పొమ్మన్నాడు. దీంతో ఇనుప రాడ్డుతో లోకో పైలట్ తలపై బలంగా కొట్టి.. జేబులో ఉన్న రూ.750 తీసుకొని నిందితుడు పారిపోయాడు. దాడి చేసేందుకు వినియోగించిన ఇనుప రాడ్‌ను పక్కనే ఉన్న పొదల్లో విసిరేసి పరారయ్యాడు. ఆ తర్వాత మరికొందరిని నిందితుడు డబ్బుల కోసం బెదిరించాడు. దేవ్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నాం" అని పోలీసులు తెలిపారు.

## సత్యసాయి జిల్లాలో దారుణం.. అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం

**విశ్వంభర, చిలమత్తూరు:** సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామంలో శనివారం దారుణం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు అత్త, కోడలిపై అత్యాచారానికి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉపాధి నిమిత్తం గ్రామానికి వచ్చారు. ఓ నిర్మాణం వద్ద వారంతా వాచ్‌మెన్, తదితర విధులను నిర్వర్తిస్తున్నారు. ఈక్రమంలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చారు. నిర్మాణం వద్ద నివాసం ఉంటున్న అత్త, కోడలిని కత్తులతో బెదిరించి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన తండ్రీ, కుమారుడిని బెదిరించారు. ఈ ఘటనపై బాధితులు చిలమత్తూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే పట్టుకుంటామని హామీ ఇచ్చారు.

### నిందితులను కఠినంగా శిక్షించాలి

శ్రీసత్యసాయి జిల్లాలో జరిగిన అత్యాచార ఘటనపై జిల్లా ఎస్పీతో మాట్లాడిన సీఎం చంద్రబాబు దర్యాప్తు వివరాలు తెలుసుకున్నారు. దుండగులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఆదేశిం చారు. ఈ ఘటనకు సంబంధించి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.
ఈ ఘటనపై మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసు లను ఆదేశించారు. ఉపాధి కోసం వచ్చిన కుటుంబ సభ్యులను బంధించి అత్తాకోడలిపై అఘాయిత్యా నికి పాల్పడి క్షమించరాని నేరం చేశారని తెలిపారు. పండగ వేళ ఇటువంటి ఘటన చోటు చేసు కోవడం బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని సవిత హామీ ఇచ్చారు.

### చిలమత్తూరు సామూహిక అత్యాచార ఘటనలో పురోగతి

శ్రీసత్యసాయి జిల్లాలో జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో హిందూపురానికి చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను చిల్లర దొంగతనాలు చేసే ముఠాగా పోలీసులు గుర్తించారు. వారిని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామంలో శనివారం అత్త, కోడలిపై సామూహిక అత్యాచారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని బళ్లారికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉపాధి నిమిత్తం గ్రామానికి వచ్చారు. ఓ నిర్మాణం వద్ద వారంతా వాచ్‌మెన్, తదితర విధులను నిర్వర్తిస్తున్నారు. ఈక్రమంలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చారు. నిర్మాణం వద్ద నివాసం ఉంటున్న అత్త, కోడలిని కత్తులతో బెదిరించి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన తండ్రీ, కుమారుడిని బెదిరించారు. ఈ ఘటనపై బాధితులు చిలమత్తూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు విచారణ చేపట్టి తాజాగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

## ఏ వృత్తిలో విజయం సాధించాలన్నా ఫిట్‌నెస్ ముఖ్యం: కేంద్ర మంత్రి పెమ్మసాని





**విశ్వంభర, గుంటూరు:** ఫిట్‌నెస్ అంటే కేవలం శరీరానికి మాత్రమే కాదని.. మనసు, మెదడుకు కూడా సంబంధించిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులో పోస్టల్ శాఖ నిర్వహించిన ఇండియా పోస్ట్ రన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక దృఢత్వం ఉన్నవారు చురుకుగా ఆలోచిస్తారని, సమస్యలను వేగంగా పరిష్కరిస్తారని తెలిపారు. అందుకే మనం ఏ వృత్తిలో విజయం సాధించాలన్నా ఫిట్‌నెస్ చాలా ముఖ్యమని వివరించారు. 'హెల్తీ ఇండియా - హ్యాపీ ఇండియా' నినాదం సాకారం కావాలంటే.. చిన్నప్పటి నుంచి పిల్లలకు వ్యాయామం, నడక, ఆటలు తప్పనిసరి అలవాటు చేయాలని సూచించారు. 'ఫిట్ ఇండియా- ఫిట్ ఏపీ' అనే స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు విజయవాడ జనరల్ పోస్ట్ మాస్టర్ మూర్తి తెలిపారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ... కొత్త సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా పోస్టల్ శాఖ ప్రజల అవసరాలు తీరుస్తోందన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రతిరోజు ఆరోగ్యం కోసం గంట సమయం కేటాయించాలని సూచించారు.




# జీరో ఎఫ్ఐఆర్ అంటే ఏమిటి?




**భారత న్యాయ వ్యవస్థలో మూడు కొత్త నేర చట్టాలు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) ఈ ఏడాది జులై 1 నుంచి అమల్లోకి వచ్చాయి. అప్పటి నుంచి జీరో ఎఫ్ఐఆర్ ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకుముందు నుంచే జీరో ఎఫ్ఐఆర్ అనేది చట్టంలో ఉంది. కానీ, నూతన చట్టాలు అమల్లోకి వచ్చాక జీరో ఎఫ్ఐఆర్‌ను తప్పనిసరి చేశారు. దీని గురించి ప్రజల్లో అవగాహన లేదు. దీనిపై సామాన్య ప్రజానీకానికి అవగాహన కల్పించేందుకు విశ్వంభర లీగల్ డెస్క్ అందిస్తున్న ప్రత్యేక కథనం..**

**జీరో ఎఫ్ఐఆర్ నిర్వచనం, లక్షణాలు..**

ఎవరిపైనైనా ఎవరైనా వ్యక్తి ఫిర్యాదు చేయాలనుకొంటే.. తన పరిధికి సంబంధించని ఏదైనా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. బాధితురాలి లేదా బాధితుడి ఫిర్యాదును స్వీకరించి దానిని సంబంధింత పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేసి.. అక్కడే దర్యాప్తు ప్రారంభిస్తారు. జీరో ఎఫ్ఐఆర్ అనేది నేరం జరిగిన ప్రదేశంతో సంబంధం లేకుండా, ఏ పోలీసు స్టేషన్‌లోనైనా ఫైల్ చేయగల ప్రథమ సమాచార నివేదిక(ఎఫ్ఐఆర్). సాధారణ ఎఫ్ఐఆర్ వలె కాకుండా, పోలీసు స్టేషన్ అధికార పరిధికి అనుగుణంగా నంబరు చేస్తారు. జీరో ఎఫ్ఐఆర్‌కు '0' గుర్తు ఉంటుంది. ఇది ఇంకా నిర్దిష్ట అధికార పరిధికి కేటాయించలేదని సూచిస్తుంది. ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత, అది నేరం జరిగిన ప్రాంతంపై అధికార పరిధిని కలిగి ఉన్న తగిన పోలీసు స్టేషన్‌కు బదిలీ అవుతుంది.

**ఫిర్యాదుదారు పాత్ర:**

జీరో ఎఫ్ఐఆర్ ప్రక్రియలో ఫిర్యాదుదారు కీలక పాత్ర పోషిస్తాడు. ఎఫ్ఐఆర్ దాఖలు చేసే సమయంలో వారు పోలీసులకు ఖచ్చితమైన, సవివరమైన సమాచారాన్ని అందించామని నిర్ధారించుకోవాలి. ఎఫ్ఐఆర్ తగిన అధికార పరిధికి బదిలీ అయిందని, దర్యాప్తు పురోగతిలో ఉందని నిర్ధారించుకోవడానికి ఫిర్యాదుదారుడు పోలీసులను అనుసరించడం మంచిది.

**పోలీసుల బాధ్యతలు:** నేరం నివేదించబడినప్పుడు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు చట్టపరమైన బాధ్యతను కలిగి ఉంటారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి నిరాకరిస్తే సంబంధిత పోలీసు అధికారులపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయి. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన బాధ్యత పోలీసు అధికారుల తప్పనిసరి విధి.

**ప్రయోజనాలు:**

1. అధికార పరిధిలోని సమస్యల కారణంగా బాధితులు వెనక్కి వెళ్లే, ఆలస్యం అయ్యే పరిస్థితులను జీరో ఎఫ్ఐఆర్ నిరోధిస్తుంది. తీవ్రమైన నేరాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో , వేగవంతమైన చర్య అవసరమైన సందర్భాల్లో ఇది చాలా ప్రయోజనకరం. లైంగిక వేధింపులు, గృహ హింస, ఇతర తీవ్రమైన నేరాల వంటి నేరాల బాధితులకు ఈ నిబంధన ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. జీరో ఎఫ్ఐఆర్ అధికార పరిధితో సంబంధం లేకుండా ఏదైనా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదును నమోదు చేయడానికి అనుమతిస్తుంది కాబట్టి, తద్వారా న్యాయాన్ని ఆలస్యం చేసే క్లిష్టమైన అడ్డంకిని తొలగిస్తుంది. అత్యాచారం, హత్య, ఇతర గుర్తించదగిన నేరాల వంటి తీవ్రమైన నేరాల బాధితులకు ఈ చట్టపరమైన నిబంధన చాలా కీలకమైనది.బాధితులకు సమస్య ఎదురైనప్పుడు సత్వర పరిష్కారానికి, వేగంగా ఫిర్యాదు చేయడానికి సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసే అవకాశం ఈ చట్టం కల్పిస్తున్నది. ఈ కారణంగా బాధితులు అధికార పరిధిలోని అడ్డంకులను ఎదుర్కోకుండా ఉపయోగపడుతుంది. బాధితులు ఖచ్చితమైన అధికార పరిధిలోని పోలీసు స్టేషన్‌కు నేరాన్ని నివేదించడం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, భౌగోళిక పరిమితుల కారణంగా వారి ఫిర్యాదులు తిరస్కరించడం, విస్మరించడం తగ్గిపోతుంది. వారు ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చని తెలుసుకోవడం వల్ల ఎక్కువ మంది బాధితులు నేరాలను నివేదించడానికి వీలు కలుగుతుంది.

2.జీరో ఎఫ్ఐఆర్‌ను సత్వరం నమోదు చేయడం ద్వారా సాక్షులను భద్రపరచడంలో, బాధితులకు రక్షణ కల్పించడంలో సహాయపడుతుంది. జీరో ఎఫ్ఐఆర్ తీవ్రమైన నేరాలలో బాగా ఉపయోగపడుతుంది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసిన తర్వాత చట్టబద్ధంగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఏదైనా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులను తక్షణమే నమోదు చేయడానికి అనుమతించడం ద్వారా, జీరో ఎఫ్ఐఆర్ వివిధ అధికార పరిధుల్లో ఫిర్యాదులు ఎలా రికార్డ్ అవుతున్నాయి, ప్రాసెస్ అవుతున్నాయనే విషయంలో స్థిరత్వాన్నికొనసాగించడంలో సహాయపడుతుంది.

**జీరో ఎఫ్ఐఆర్ సవాళ్లు, విమర్శలు..**

**అమలు సమస్యలు:** జీరో ఎఫ్ఐఆర్‌కు మద్దతు ఇచ్చే చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ ఉన్నప్పటికీ, దాని అమలులో అనేక సవాళ్లు ఉన్నాయి. జీరో ఎఫ్ఐఆర్ విధానం గురించి ప్రజలకు అవగాహన లేకపోవడం ఒక ప్రాథమిక సమస్య. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, ఈ నిబంధన గురించి తెలియదు. అవగాహన లేమి వల్ల కొంతమంది పోలీసు అధికారులు అధికార పరిధి సమస్యలను పేర్కొంటూ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి నిరాకరించవచ్చు.తద్వారా బాధితుల హక్కుల పరిరక్షణ, న్యాయాన్ని సకాలంలో అందేలా చూడటంలో అవగాహన లేమితో నష్టం జరగవచ్చు. అంతేగాకుండా పోలీసు స్టేషన్ల మధ్య న్యాయపరమైన వివాదాలకు అవకాశం ఉండటం మరో సవాలు. కొన్ని సందర్భాల్లో, నేరం మరొక అధికార పరిధిలోకి వస్తుందని భావించినట్లయితే, పోలీసు అధికారులు జీరో ఎఫ్ఐఆర్‌ని అంగీకరించడానికి ఇష్టపడరు. దీంతో ఎఫ్ఐఆర్ బదిలీ, తదుపరి విచారణలో జాప్యం జరిగే అవకాశం ఉంది.

**అడ్మినిస్ట్రేటివ్ ఇబ్బందులు:** జీరో ఎఫ్ఐఆర్‌ను తగిన అధికార పరిధికి బదిలీ చేసే ప్రక్రియ కూడా పోలీసులకు పరిపాలనా భారాన్ని సృష్టిస్తుంది. మొత్తం సంబంధిత సమాచారం ఖచ్చితంగా బదిలీ అయిందని, ప్రక్రియ సమయంలో క్లిష్టమైన సాక్ష్యం కోల్పోకుండా ఉండేలా చూసుకోవడం ఇందులో ప్రధానం. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసే పోలీసు అధికారులు.. దానికి సంబంధించి తమ పరిధిలోకి రాకున్నా.. చాలా జాగ్రత్తలు వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వారు నిర్వహిస్తున్న విధులకు ఈ విధానం అదనపు భారమే..

**విమర్శలు:** ఉదాహరణకు, వ్యక్తులు నేరుగా నేరంతో సంబంధం లేని అధికార పరిధిలో ఎఫ్ఐఆర్‌లను దాఖలు చేయవచ్చు, ఇది విచారణలో గందరగోళం, జాప్యానికి దారి తీస్తుంది.

**ప్రభుత్వాలు చేయాల్సిన పనులు**

**శిక్షణ అవగాహన:** జీరో ఎఫ్ఐఆర్‌పై పోలీసు అధికారులు చట్టం ప్రకారం తమ బాధ్యతలను అర్థం చేసుకునేలా వారికి మెరుగైన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. అంతేకాకుండా పౌరులకు దీనిపై అవగాహన కల్పించడానికి ప్రజా చైతన్య ప్రచారాలు కూడా అవసరం. జీరో ఎఫ్ఐఆర్ ప్రయోజనాలను పూర్తిగా గ్రహించేలా అవగాహన లేమి, పరిపాలనాపరమైన అడ్డంకులు సహా అమలులో ఉన్న సవాళ్లను ప్రభుత్వాలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

**జీరో ఎఫ్ఐఆర్ కు బీజం పడింది ఇలా..**

సత్వీందర్ కౌర్ వర్సెస్ స్టేట్ (1999) లో ఢిల్లీ హైకోర్టు, సంఘటన జరిగిన ప్రదేశం నుండి మాత్రమే కాకుండా, ఏ ప్రదేశం నుండి అయినా బాధితులు వారి స్థానంతో సంబంధం లేకుండా తన ఫిర్యాదు చేసే హక్కు ఒక మహిళకు ఉందని తీర్పునిచ్చింది. ఈ తీర్పు జీరో ఎఫ్ఐఆర్ వెనుక ఉన్న సూత్రాలను మరింత బలపరిచేలా బీజం పడింది.

**జీరో ఎఫ్ఐఆర్ లీగల్ ఫౌండేషన్...**

నిర్భయ కేసు తర్వాత ఏర్పాటైన జస్టిస్ వర్మ కమిటీ సిఫార్సుల ఆధారంగానే జీరో ఎఫ్ఐఆర్ పుట్టుకొచ్చింది. మహిళలకు మెరుగైన రక్షణ, న్యాయం జరిగేలా క్రిమినల్ చట్టానికి సవరణలు సూచించే బాధ్యతను కమిటీకి అప్పగించారు. జీరో ఎఫ్ఐఆర్‌ను ప్రవేశపెట్టడం దాని ముఖ్య సిఫార్సులలో ఒకటి. దీన్ని తరువాత చట్టంగా ఆమోదించారు. జీరో ఎఫ్ఐఆర్ అనేది భారతీయ నేర న్యాయ వ్యవస్థలో గణనీయమైన పురోగతిగా చెప్పవచ్చు. నేరాలను సకాలంలో నమోదు చేయడం, దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేయడం దీని లక్ష్యం. జీరో ఎఫ్ఐఆర్ ఉద్దేశ్యాన్ని క్రిమినల్ లా (సవరణ) చట్టం, 2013 ద్వారా అమలు చేస్తున్నారు.

**జస్టిస్ వర్మ కమిటీ సిఫార్సులు..**

ఫిర్యాదులను దాఖలు చేయడంలో బాధితులు ఎదుర్కొంటున్న అవరోధాలను గుర్తించిన జస్టిస్ వర్మ కమిటీ, ముఖ్యంగా లైంగిక హింస కేసుల్లో, ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఎటువంటి అధికార పరిమితులు లేకుండా నమోదు చేయాలని సిఫార్సు చేసింది. న్యాయపరిధి సమస్యల కారణంగా బాధితులు పోలీసు స్టేషన్‌ల నుండి వెనుదిరగకుండా నిరోధించడం హేతుబద్ధమైనది. దీని ఫలితంగా దర్యాప్తు, బాధితుడి భద్రతకు రాజీ పడే ఆలస్యం తరచుగా జరుగుతుంది.

**జీరో ఎఫ్ఐఆర్ మౌలిక సూత్రాలను సమర్థించిన సుప్రీంకోర్టు..**

లలితా కుమారి వర్సెస్ ప్రభుత్వం అనే కేసులో ఉత్తరప్రదేశ్‌లో (2014), గుర్తించదగిన నేరం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ తీర్పు జీరో ఎఫ్ఐఆర్ వెనుక ఉన్న సూత్రాలను బలపరిచింది. న్యాయ పరిధిలోని సాంకేతిక కారణాల వల్ల బాధితులెవరూ న్యాయం పొందేందుకు నిరాకరించబడకుండా ఉండాలన్నారు.

## జీరో ఎఫ్ఐఆర్ ఫైల్ చేసే ప్రక్రియ..

**దశల వారీ విధానం...**

**ఫిర్యాదు చేయడం:** బాధితుడు లేదా ఫిర్యాదుదారు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారాన్ని అందిస్తారు లేదా ఫిర్యాదు చేస్తారు. పోలీసు అధికారి రాతపూర్వకంగా సమాచారాన్ని నమోదు చేస్తారు. **జీరో ఎఫ్ఐఆర్ నమోదు:** బాధితుడు, ఫిర్యాదుదారుడు నుంచి కంప్లైంట్‌ను స్వీకరించిన తర్వాత..సాధారణ ఎఫ్ఐఆర్ నంబర్‌ను కేటాయించకుండా 'జీరో ఎఫ్ఐఆర్'గా నమోదు చేస్తారు. సరిహద్దులతో సంబంధం లేకుండా, జీరో ఎఫ్ఐఆర్‌ని ఏదైనా పోలీసు స్టేషన్‌లో నమోదు చేయవచ్చు.

**సంబంధిత అధికార పరిధికి బదిలీ:** జీరో ఎఫ్ఐఆర్ తర్వాత నేరం జరిగిన ప్రాంతంపై అధికార పరిధిని కలిగి ఉన్న పోలీస్ స్టేషన్‌కు బదిలీ అవుతుంది. విచారణలో జాప్యం జరగకుండా ఉండేలా ఈ బదిలీని వెంటనే చేపట్టాలి.

**తక్షణ చర్య:** జీరో ఎఫ్ఐఆర్ తగిన పోలీస్ స్టేషన్‌కు చేరిన తర్వాత, అది సాధారణ ఎఫ్ఐఆర్ నంబర్‌తో మళ్లీ నమోదు అవుంది. దర్యాప్తు ప్రారంభమవుతుంది. దర్యాప్తు అధికారికి కేసు కేటాయిస్తారు. సాక్ష్యాధారాల సేకరణ, సాక్షుల విచారణ, అనుమానితుల అరెస్టు వంటి దర్యాప్తు కోసం ప్రామాణిక విధానాలు అనుసరిస్తారు. సాధారణ ఎఫ్ఐఆర్ నమోదు తర్వాత పోలీసు అధికారులు దర్యాప్తు ప్రక్రియ వీలైనంత త్వరగా ప్రారంభమయ్యేలా చూసుకోవాలి.

## గతంలో నమోదైన జీరో ఎఫ్ఐఆర్ కేసులు..

**నిర్భయ కేసు (2012):**

నిర్భయ గ్యాంగ్ రేప్ కేసు భారతదేశంలో జీరో ఎఫ్ఐఆర్ ప్రవేశపెట్టడానికి ఉత్ప్రేరకం. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం, తదుపరి విచారణ, న్యాయపరిధితో సంబంధం లేకుండా బాధితులు వెంటనే నేరాలను నివేదించడానికి అనుమతించే చట్టపరమైన యంత్రాంగం అవసరాన్ని హైలైట్ చేసింది. ఈ కేసు జస్టిస్ వర్మ కమిటీ ఏర్పాటుకు దారితీసింది. భారత నేర న్యాయ వ్యవస్థలో కీలక సంస్కరణగా జీరో ఎఫ్ఐఆర్‌ను స్వీకరించింది.

**కథువా రేప్ కేసు (2018):**

కథువా అత్యాచారం కేసులో, అధికార పరిధి వివాదాల కారణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో బాధితురాలి కుటుంబం గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంది. తొలుత ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు పోలీసులు నిరాకరించడంతో విచారణలో జాప్యం నెలకొంది. తీవ్రమైన నేరాల బాధితులు అనవసర జాప్యం లేకుండా న్యాయం పొందేలా జీరో ఎఫ్ఐఆర్‌ను సమర్థంగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఈ కేసు నొక్కి చెప్పింది.

**దిశా రేప్ అండ్ మర్డర్ కేసు (2019):**

తెలంగాణలో సంచలనం సృష్టించిన దిశా అత్యాచారం, హత్య కేసులో, న్యాయపరిధిలోని సమస్యలను పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు మొదట నిరాకరించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జరిగిన ఈ జాప్యం ప్రజల ఆగ్రహానికి దారితీసింది. బాధితులు నేరాలను తక్షణమే నివేదించగలరని నిర్ధారించడం జీరో ఎఫ్ఐఆర్ ప్రాముఖ్యతను ఈ కేసు హైలైట్ చేసింది. ప్రజల నిరసనను అనుసరించి, పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. ఆపై విచారణ కోసం తగిన అధికార పరిధికి బదిలీ చేశారు.

- విశ్వంభర డెస్క్ (లీగల్)
సెల్: 6304475133



# మనిషికి నడక మంచి మందు

ఈ మాట వినగానే ఆశ్చర్యపోతున్నారా? ఇది నిజం! ఇది నా మాట కాదు. అప్పుడెప్పుడో 2,480 సంవత్సరాల క్రితం జీవించి, ఫాదర్ ఆఫ్ మెడిసిన్ గా పేరొందిన హిపోక్రాట్స్ అనే వైద్యరంగ నిపుణుడు అన్న మాట ఇది. ప్రతిరోజు కనీసం 15 నుంచి 30 నిమిషాల పాటు అయినా వాకింగ్ చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని ఆయన చెప్పారు. వైద్య రంగ నిపుణులు కూడా ఆయన చెప్పిన ప్రయోజనాలను సమర్థిస్తున్నారు. మరి ఆయన చెప్పిన ఆ ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం.

**వాకింగ్ తో హార్మోన్స్ విడుదల**

మనిషి ప్రతిరోజు ఉదయం కాని సాయంత్రం కాని రెగ్యులర్ గా వాకింగ్ చేయడం వల్ల శరీరంలో 'ఎండార్ఫిన్స్ అనే హార్మోన్స్ విడుదలవుతాయి. ఇవి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అంతేకాక మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, బ్యాడ్ కొలెస్ట్రాల్, కంగారు, అధిక రక్తపోటు, డయాబెటిస్, అధిక బరువు వంటి సమస్యలు తగ్గిపోతాయి.

**వాకింగ్ తో కంటి సమస్యలు, డయాబెటిస్ నిర్మూలన**

వయస్సు మీద పడడం కారణంగా వచ్చే డెమెన్షియా, అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయి. ప్రతిరోజు వాకింగ్ చేయడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుందని వైద్యశాస్త్ర అధ్యయనాలు చెబుతున్నాయి. కంటికి సంబంధించిన పలునాడులు కాళ్లలో ఉంటాయి. అందుకని వాకింగ్ చేయడం వల్ల కంటి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని వైద్యులు చెబుతున్నారు. నిత్యం వాకింగ్ చేస్తే కళ్ళపై అధిక ఒత్తిడి తగ్గడంతో పాటు, గ్లకోమా వంటి కంటి వ్యాధులు రాకుండా ఉంటాయట. నిత్యం రన్నింగ్ చేస్తే ఎటువంటి లాభాలు కలుగుతాయో, అటువంటి బెనిఫిట్స్ వాకింగ్ చేయడం వల్ల కూడా కలుగుతాయని అమెరికన్ హార్ట్ డాక్టర్స్ అసోసియేషన్ (AH DA) తెలియజేస్తోంది. ప్రతి నిత్యం వాకింగ్ చేస్తే గుండె సమస్యలు హార్ట్ ఎటాక్ రావట. హై బీపీ, బ్యాడ్ కొలెస్ట్రాల్ తగ్గుతాయట. దీంతో పాటు శరీరంలో రక్త సరఫరా మెరుగుపడుతుంది. వాకింగ్ చేయడం వల్ల శరీరం ఆక్సిజన్ ను ఎక్కువగా గ్రహిస్తుంది. దీంతో అదే ఆక్సిజన్ రక్తంలో చేరి అది ఊపిరితిత్తులకు అందుతుంది. ఈ క్రమంలో సదరు ఆక్సిజన్ ఊపిరి తిత్తుల్లో ఉండే టాక్సిన్లు, విష, వ్యర్థ పదార్థాలను బయటకు పంపుతుంది ఇతర ఊపిరితిత్తుల సమస్యలు కూడా దూరం అవుతాయి. డయాబెటిస్ ఉన్నవారు నిత్యం రన్నింగ్ కన్నా వాకింగ్ చేస్తేనే ఎంతో ప్రయోజనం కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా వాకింగ్ కానీ రన్నింగ్ కానీ చేసిన కొందరు డయాబెటిస్ పేషంట్లను సైంటిస్టులు పరిశీలించగా ఈ విషయం వెల్లడైంది. వాకింగ్ చేసిన వారిలో రక్తంలోని గ్లూకోస్ స్థాయిలు బాగా అదుపులోకి వచ్చాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. అందువల్ల రోజు వాకింగ్ చేస్తే డయాబెటిస్ ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చుని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు.

**రెగ్యులర్ వాకింగ్ తో హ్యాపీ లైఫ్**

నిత్యం కనీసం 30 నిమిషాల పాటు ఉదయం కానీ సాయంత్రం కానీ వాకింగ్ చేస్తే పెద్దపేగు క్యాన్సర్ వచ్చే ముప్పు చాలా వరకు తగ్గుతుందని వైద్యశాస్త్ర పరిశోధనల్లో తేటతెల్లం చేశాయి. జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం పోతుంది. విరేచనం రోజు సాఫీగా అవుతుంది. నిత్యం 10,000 అడుగులు అంటే 100 నిమిషాల పాటు వాకింగ్ చేస్తే అధిక బరువు త్వరగా తగ్గుతారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతోపాటు కండరాలు దృఢంగా మారుతాయి. నిత్యం వాకింగ్ చేయడం వల్ల కీళ్ల నొప్పులు తగ్గి కీళ్లు బాగా పనిచేస్తాయి. అవి అంత త్వరగా అరిగిపోవు. అలాగే ఎముకల్లో సాంద్రత పెరుగుతుంది. దీంతో ఫ్రాక్చర్లు, కీళ్ల నొప్పులు, మోకాళ్ళ నొప్పులు వచ్చే అవకాశాలు వీలైనంతవరకు తగ్గుతాయి.

**వాకింగ్ తో ఆరోగ్య భారత్ ను ఆవిష్కరిద్దాం!**

ప్రతిరోజు కనీసం 30 నిమిషాల పాటు అయినా తప్పనిసరిగా వాకింగ్ చేయాలి ఇలా చేస్తే కీళ్ల నొప్పులు వాపులు మీ జోలికి రావు. ముఖ్యంగా బ్యాక్ పెయిన్ తో సతమతమయ్యే వారికి వాకింగ్ చక్కని ఔషధం అని చెప్పవచ్చు. లో ఇంఫాక్ట్ వ్యాయామం క్రిందకు వాకింగ్ వస్తుంది. కనుక నడుం పై పెద్దగా ఒత్తిడి పడదు. దీనికి తోడు ఆ భాగంలో ఉండే ఒత్తిడి నొప్పి కూడా తగ్గిపోతాయి. రక్త సరఫరా పెరిగి నొప్పి తగ్గుతుంది. కనుక వెన్నునొప్పి ఉన్నవారు నిత్యం తప్పనిసరిగా 30 నిమిషాల పాటు వాకింగ్ చేయడం ఎంతో మంచిది. నిత్యం వాకింగ్ చేయడం వల్ల ఎప్పుడూ డిప్రెషన్ లో ఉండేవారు మంచి మూడ్ కు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో నిరూపించారు. వారెంతో హ్యాపీగా ఉంటారని, పక్కవారిని కూడా హ్యాపీగా ఉంచుతారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కనుక ప్రతి నిత్యం క్రమం తప్పకుండా వాకింగ్ చేద్దాం! ఆరోగ్య భారత నిర్మాణంలో మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిద్దాం!



-చౌదూరి నరసింహారావు
కవి, రచయిత, సామాజిక కార్యకర్త



## అది మా కర్తవ్యం.. సీఎంగారూ..

తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితుల సహాయార్థం చిరంజీవి భారీ విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల రేవంత్ రెడ్డిని కలిసి తెలంగాణాకు ప్రకటించిన విరాళం అందించిన ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తన తరఫున రూ.50లక్షలు, రామ్‌చరణ్ తరఫున మరో రూ.50 లక్షల చెక్కును చంద్రబాబుకు అందజేశారు. ఈ సాయాన్ని మెచ్చుకుంటూ సీఎం పోస్ట్ పెట్టారు. ''ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటి రూపాయలు విరాళంగా అందించిన మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. మానవ సేవలో చిరంజీవి ఎల్లప్పుడూ ముందుంటారు. వరదల వల్ల నష్టపోయిన జీవితాలను పునర్నిర్మించడంలో వారి సహకారం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది'' అని పేర్కొన్నారు. దీనిపై చిరంజీవి తాజాగా స్పందించారు. ''మీరు నాపై చూపించిన ఆదరణకు ధన్యవాదాలు, మన ప్రజలకు విపత్తులు ఎదురైనప్పుడు సాయం అందించడం మా కర్తవ్యం. మీ సహాయక చర్యలు ఆదర్శప్రాయం'' అని చిరు ట్వీట్‌లో పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వరద బాధితులకు తమవంతు సాయం చేయడానికి ఇండస్ట్రీలో చాలామంది స్టార్లు ముందుకు వచ్చారు. భారీ మొత్తంలో విరాళాలు ప్రకటించారు. చిరంజీవి, ఆయన తనయుడు రామ్‌చరణ్ కోటి రూపాయలు విరాళంగా ప్రకటించారు. ఏపీ సీఎం చంద్రబాబును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి చెక్కును అందజేశారు.




## గత సీజన్‌లతో పోలిస్తే 'అన్‌స్టాపబుల్' సీజన్-4' ఇంకా బెస్ట్



నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఓటీటీ షో 'అన్‌స్టాపబుల్' సీజన్ -4' అక్టోబర్ 24 నుంచి స్ట్రీమింగ్ కానుంది. దసరా పండుగను పురస్కరించుకుని దీనికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలయ్య ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చారు. "ఇప్పటికే వివిధ షోలకు హోస్ట్‌గా చేయమని నన్ను చాలామంది సంప్రదించారు. నేను ఒప్పుకోలేదు. గత సీజన్ల కంటే సీజన్-4 ఇంకా బాగుంటుంది. అది మీరే చూస్తారు'' అని అన్నారు.'దసరా అంటేనే అమ్మవారు. శక్తి రూపం. గెలుపు అన్నది మన చేతుల్లోనే ఉంది. ఏదైతే కొత్తగా అనుకుంటామో ఆ జయం మనల్ని వరిస్తుంది. అందుకు ప్రతీక ఈ దసరా శరన్నవరాత్రులు. 'అన్‌స్టాపబుల్' మొదలవ్వడమే ఒక విస్ఫోటనం. నాన్నగారు ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలు చేశారు. వారి స్ఫూర్తితోనే 'అన్‌స్టాపబుల్'లాంటి కార్యక్రమానికి వ్యాఖ్యాతగా మారా. ఇంతకుముందు అలాంటి ఆఫర్లు వచ్చాయి. ఈ షో చేయమని వేరే ఎవరైనా అడిగి ఉంటే కాదు అనే చెప్పేవాడిని. కేవలం అరవింద్‌గారి కోసమే ఒప్పుకొన్నా. ఐఎండీబీ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఈ షో 18వ స్థానంలో ఉండటం అద్భుతం. ఎంతో మంది హీరోలు, దర్శకులు, నిర్మాతలు ఈ షోకు వచ్చారు. వాళ్ల వల్ల కూడా ఈ షో సక్సెస్ అయింది. ఇబ్బందికరమైన ప్రశ్నలు అడిగినా, అన్నింటికీ ఓపికగా సమాధానం ఇచ్చారు. కొత్తగా ఏది వచ్చినా తెలుగు ప్రజలు ఆదరిస్తారు. అందుకే ఈ షో మంచి విజయాన్ని అందుకుంది. ఎన్నో సినిమాలు కామిక్స్ రూపంలో వచ్చాయి. 'అన్‌స్టాపబుల్' మూడు సీజన్లు సక్సెస్ అయ్యాయి. అందుకే సీజన్-4 కొత్తగా అందించాలన్న ఉద్దేశంతో యానిమేషన్ రూపంలో ట్రైలర్ తీసుకొచ్చారు'' అని బాలయ్య చెప్పారు. అన్‌స్టాపబుల్ టాక్ షో బాలయ్య ఫ్ భుజాలపై పెడితే, ఆయన దాన్ని ఇంకా ఎత్తున పెట్టారు. ఇప్పటివరకూ వచ్చిన సీజన్లకు పూర్తిగా భిన్నంగా 'సీజన్-4' ఉంటుంది. మరింత వినోదాన్ని పంచుతుంది'' అని అల్లు అరవింద్ అన్నారు.

## గేమ్ ఛేంజర్ రిలీజ్ డేట్ ఫిక్స్



గ్లోబల్‌స్టార్ రామ్ చరణ్ సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ చిత్రం 'గేమ్ చేంజర్'. కాంబినేషన్ రీత్యా ఈ చిత్రంపై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తోంది. సంక్రాంతి సందర్భంగా జనవరి 10న ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన పోస్టర్స్, 'జరగండి జరగండి..', 'రా మచ్చా మచ్చా' సాంగ్స్‌కు చక్కని ఆదరణ లభించింది. యూట్యూబ్ లో 'రా మచ్చా మచ్చా' 55+ మిలియన్ వ్యూస్‌తో ట్రెండింగ్‌లో ఉంది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో రామ్ చరణ్ స్టైలిష్ లుక్‌లో అదరగొడుతున్నారు. శంకర్ లార్జర్ దేన్ లైఫ్ సినిమాలను తెరకెక్కించటమే కాకుండా, అభిమానులకు ప్రేక్షకులకు డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంటారు. రామ్ చరణ్‌లాంటి మాస్ హీరో ఉన్నప్పుడు ఆ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఎలా ఉంటుందో చూడాలని మెగా అభిమానులు, మూవీ లవర్స్ 'గేమ్ ఛేంజర్' కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన తెరకెక్కించిన సినిమాలను మించేలా 'గేమ్ ఛేంజర్'ను రూపొందిస్తున్నారని, చరణ్‌ను ఫవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేస్తున్నారని మేకర్స్ చెబుతున్నారు. కియారా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

## అదే నా సమస్య.. కానీ, నా భర్త అర్థం చేసుకున్నాడు!


బాలీవుడ్ హీరోయిన్ ఆలియాభట్ ఓ ఇబ్బంది పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తాజాగా కరీనా కపూర్ ఖాన్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో ఆమె ఈ విషయాలను పంచుకుంది. ఈ సమస్య విషయంలో భర్త రణ్‌బీర్ కపూర్ తనకెంతో మద్దతుగా నిలిచినట్లు అలియా చెప్పుకొచ్చింది. ''రాహా పుట్టిన తర్వాత ఆమె ఫొటోను పంచుకోకపోతే జనాలు ఏమనుకుంటారోనని అనుకునేదాన్ని. నాకు కాస్త అసౌకర్యంగా ఉండేది. ఎందుకంటే తను చాలా చిన్న పాప. తను ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్ కాకూడదు. 2023లో క్రిస్మస్ సందర్భంగా లంచ్ చేద్దామని కారులో బయలుదేరాం. అప్పుడు రణ్‌బీర్ 'మనం రాహాతో కలిసి ఈ రోజు ఫొటో దిగుదామా' అని అడిగాడు.నేను ఒక్కసారిగా కంగారు పడ్డాను. 'నువ్వు నిజంగా అంటున్నావా' అని అన్నాను. ఎందుకంటే నాకెందుకో ఆందోళనగా అనిపించింది. ప్రతిక్షణం అలాగే అనిపిస్తూ ఉంటుంది. కొన్నిసార్లు అది మరింత తీవ్రంగా ఉంటుంది. నా పరిస్థితిని రణ్‌బీర్ అర్థం చేసుకున్నాడు. వేరే విషయాల గురించి మాట్లాడటం మొదలు పెట్టాడు. బాంద్రా, జుహూ ఇలా ఏదో ఒకటి మాట్లాడేవాడు. ఇదంతా జీవితంలో ఒక బాగమని కొన్నాళ్ల తర్వాత నాకు అర్థమైంది'' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆలియాభట్ కథానాయికా ప్రాధాన్యం ఉన్న చిత్రాలు చేస్తూనే కమర్షియల్ చిత్రాల్లోనూ నటిస్తోంది. తాజాగా 'జిగ్రా'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దసరా కానుకగా వచ్చిన ఈ చిత్రం తెలుగులోనూ విడుదలైంది. ప్రస్తుతం 'ఆల్ఫా' చిత్రంలో నటిస్తోంది.

## భవిష్యత్తు ప్రణాళిక చెప్పిన దర్శకుడు



'ఖైదీ', 'విక్రమ్' చిత్రాలతో పాపులారిటీ సంపాదించుకున్నారు దర్శకుడు లోకేశ్ కనగరాజ్ . ప్రస్తుతం ఆయన తెరకెక్కిస్తున్న చిత్రం 'కూలీ' . ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆయన అభిమానులతో కాసేపు ముచ్చటించారు. లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ (ఎల్‌సీయూ-LCU)పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ యూనివర్స్‌లో 'కూలీ' భాగం కాదన్నారు. ఆ సినిమా తర్వాత అదిరిపోయే ప్రాజెక్ట్ రానుందని.. ఎల్‌సీయూలో భాగమైన హీరోలందరితో ఇది ఉంటుందని అన్నారు. రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న 'కూలీ' గురించి చెబుతూ ''ఆరు నెలలకు మించి షూటింగ్ చేయడం నాకు నచ్చదు. ఇప్పటి వరకూ చేసిన సినిమాలన్నీ అంతలోపే పూర్తి చేశా. 'కూలీ' కూడా ఆ విధంగా చేయడానికి ప్రయత్నిస్తున్నా. ఇటీవల రజనీకాంత్‌కు సర్జరీ జరిగింది. ఆయన ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోవడం నా బాధ్యత. అక్టోబర్ 16 నుంచి ఆయన సెట్స్‌లోకి తిరిగి అడుగుపెట్టనున్నారు'' అని అన్నారు.తన భవిష్యత్తు ప్రణాళిక గురించి మాట్లాడుతూ.. ''రానున్న ఐదేళ్లపాటు బ్లడ్, గన్స్ లేకుండా సినిమాలు ప్లాన్ చేయలేను. ఎందుకంటే ఇప్పటికే అలాంటి కథలకు కమిట్ అయ్యా. 'ఖైదీ', 'విక్రమ్', 'లియో'తో లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ మొదలైంది. దానిని సరైన విధంగా పూర్తి చేయాలి. 'విక్రమ్'ని అద్భుతంగా పూర్తి చేసేందుకు 'రోలెక్స్' సీన్స్ క్రియేట్ చేశా. ఆ పాత్రకు వచ్చిన క్రేజ్ దృష్టిలో ఉంచుకుని 'రోలెక్స్'పై ఒక స్టాండలో మూవీ చేయాలనుకుంటున్నా. 'కూలీ' పూర్తి చేసిన తర్వాత, ఎల్‌సీయూ హీరోలందరితో పీక్ ఎల్‌సీయూ మూవీ చేయనున్నాను'' అని లోకేశ్ కనగరాజ్ అన్నారు.. 'లియో 2'కు అవకాశం వస్తే తప్పకుండా చేస్తానన్నారు. దానికి పార్తిబన్ అనే టైటిల్ పెడతానని చెప్పారు.

## శ్రేయా గోషాల్‌కు స్ఫూర్తి ఎవరో తెలుసా?



ఒకవైపు సినిమా పాటలతో బిజీగా ఉన్నా... మరోవైపు ప్రైవేటు గీతాలు కూడా పాడుతూ... తన గాత్రానికి మరింత వైవిధ్యాన్ని జోడించే ప్రయత్నం చేస్తోంది బెంగాలీ సింగర్ శ్రేయా గోషాల్. తన పాటలకు తనే సాహిత్యం రాసుకొని, వాటిని విడుదల చేస్తోంది. 'న వో మై, అప్‌నీ మాతీ' తదితర పాటలు వాటిల్లో ఉన్నాయి. 73వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా రూపొందించిన 'అప్‌నీ మాతీ' గీతాన్ని... సద్గురు జగ్గీవాసుదేవ్ 'ఇషా ఫౌండేషన్' తమ 'సేవ్ సాయిల్' ఉద్యమానికి ఉపయోగించుకుంది. పలువురు అంతర్జాతీయ కళాకారులతో కలిసి కొన్ని ఆల్బమ్స్ చేసింది. ఇక దేశవిదేశాల్లో ఆమె ఇచ్చే లైవ్ షోలకు లెక్కే లేదు. మరి అలాంటి శ్రేయా గోషాల్ తనకు స్ఫూర్తి ఎవరో తాజాగా చెప్పుకొచ్చింది. అలాగే తన వ్యక్తిగత విషయాలను కూడా కొన్ని తెలియపరిచింది.

**స్ఫూర్తి మంత్రం...**

సంగీతంపై తనకు మక్కువ కలిగింది తన తల్లి శర్మిష్టను చూసే అంటారు శ్రేయ. శర్మిష్ట క్లబ్బుల్లో శాస్త్రీయ బెంగాలీ గీతాలు ఆలపించేవారు. ఆవిడే శ్రేయను అంత చిన్న వయసులో సంగీతం వైపు నడిపించారు. 'నా తొలి గురువు మా అమ్మే. నా తొలి విమర్శకురాలు కూడా తనే. లతామంగేష్కర్‌ను, కేఎస్ చిత్రను గాత్రంలో నా గురువులుగా భావిస్తాను. నేను పాడే శైలిపై వాళ్ల ప్రభావం ఎంతో ఉంది. అలాగే వైవిధ్యంలో ఆశాభోంశ్లే, గీతా దత్తా, ఘజల్స్‌లో జగ్జీత్‌సింగ్ నాకు స్ఫూర్తి అంటున్నారు శ్రేయ.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com